ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
గురువారం 26 డిసెంబరు 2024



యడ్లపాడు : తిమ్మాపురం లూథరన్ క్రీస్తు దేవాలయంలో ఆకట్టుకుంటున్న అలంకరణ



క్రోసూరు : ప్రార్థనలకు హాజరైన భక్తులు



సత్తెనపల్లి : భక్తి గీతాలు ఆలపిస్తున్న యువతులు



గుంటూరు : ప్రార్థనలో పాల్గొన్న యువతులు



కారంపూడి లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో భక్తులు

సంబరంగా క్రిస్మస్

● భక్తులతో కిటకిటలాడిన చర్చిలు ● ప్రత్యేక ప్రార్థనలకు హాజరైన ప్రముఖులు

నరసరావుపేట, డిసెంబరు 25: క్యాండిల్స్ వెలుగులు.. కేక్ కటింగ్‌లు.. క్రీస్తు సంగీత కార్యక్రమాలు.. పాస్టర్ల సందేశాలు.. భక్తుల కేరింతల మధ్య క్రిస్మస్ వేడుకలు సంబరంగా జరిగాయి. మంగళవారం అర్ధరాత్రి పూజలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం నుంచి క్రిస్మస్ సంబ రాలు ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు, పూజలు నిర్వహించారు. క్రైస్తవులు అత్యంత ఘనంగా జరుపుకునే క్రిస్మస్ సంబరాలు జిల్లా వ్యాప్తంగా అంబరాన్ని అంటాయి. ఈ సందర్భంగా చర్చిల్లో పాస్టర్లు క్రిస్మస్ సందేశం ఇచ్చారు. క్రీస్తు ప్రబోధనలు ఆచరణీయమని భక్తులకు వివరించారు. ప్రత్యేక ప్రార్థనలకు అధిక సంఖ్యలో క్రైస్తవులు హాజరవడంతో చర్చిలు కిటకిటలాడాయి. చర్చిల్లో కేక్ కట్ చేసి క్రీస్తు జన్మదిన వేడుకలు జరుపుకు న్నారు. పలుగ్రామాల్లో గ్రామోత్సవాలు కూడా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు, పూజలు, భక్తి గీతాలతో ఆలయాలు మార్మోగాయి. ఆయా ప్రార్థ నలు, పూజల్లో మత పెద్దలు, రాజకీయ నాయకు లు, ప్రజా ప్రతినిధులు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఫిరంగిపురం, నరసరావుపేట, రావి పాడు, సత్తెనపల్లి, పాటిబండ్ల, తాళ్ల చెరువు, పాటిబండ్ల, అత్తలూరు, కనపర్రు, గురజాల, రెంటచింతల, మాచర్ల, నాగార్జున సాగర్, విను కొండ, పిడుగురాళ్ల, తెనాలి, దుగ్గిరాల, బాపట్ల, రేపల్లె, చీరాల, అద్దంకి, మార్టూరు, చిలకలూ రిపేట, యడ్లపాడు, నాదెండ్ల, పొన్నూరు, చేబ్రో లు, పాతరెడ్డిపాలెం, ముట్లూరు, ప్రత్తిపాడు, పెద నందిపాడు, మంగళగిరి, తాడేపల్లి, పెదవడ్లపూడి, పెదపరిమి, తుళ్లూరు, తాడికొండ, అమరావతి, క్రోసూరు, అచ్చంపేటలతో పాటు పలు గ్రామాలు, మండల కేంద్రా ల్లోనూ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.



అచ్చంపేట : తాళ్ళచెరువులోని బాల ఏసు దేవాలయంలో దివ్యబలి పూజ చేస్తున్న బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య (ఇన్‌సెట్లో) ఫిరంగిపురం చర్చిలో బాల ఏసుతో భాగ్యయ్య

ఆదర్శవంతంగా జీవించాలి : బిషప్ భాగ్యయ్య

అచ్చంపేట, ఫిరంగిపురం: క్రైస్తవులు ఇతరులకు ఆదర్శంగా జీవిస్తూ శాంతి సమాధానంతో మెలగాలని బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య తెలిపారు. బుధవారం అచ్చంపేట మండలం తాళ్లచెరువు గ్రామంలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు హాజరైన బిషప్ బాలఏసు దేవాలయం వద్ద దివ్య బలిపూజ నిర్వహించారు. అనంతరం ఆయన క్రిస్మస్ సందేశం ఇస్తూ ప్రతి క్రైస్తవుడు ప్రేమ తత్వంతో మెలిగి ఇతరులకు ఆదర్శవంతంగా ఉండటమే నిజమైన క్రిస్మస్ అని తెలిపారు. రక్షకుడైన ఏసుక్రీస్తు ఈ ప్రపంచానికి ప్రేమ సందేశాన్ని అందించారన్నారు. ఉద యం జూబ్లీ విజయోత్సవ పతాక స్థూపం శంకుస్థాపన చేశారు. సాయంత్రం కొవ్వొ త్తుల ప్రదర్శన, తేరు ఊరేగింపు జరిగింది. ఫిరంగిపురంలోని బాలఏసు కథెడ్రల్ దేవా లయంలో క్రిస్మస్ జాగరణ సమిష్టి దివ్య పూజా బలి జరగ్గా బిషప్ భాగ్యయ్య పాల్గొన్నారు. దేవుడి కుమారుడైన జీసెస్ మనుష్య కుమా రుడిగా ఈ లోకంలో ఆదర్శవంతమైన జీవితాన్ని ఆచరించి అందరికీ ఆదర్శప్రాయులుగా నిలిచార న్నారు. నీతి, నిజాయితీలతో ఉండాలని, అప్పుడే సమాజం శాంతి సమాధానాలతో విలసిల్లుతుం దన్నారు. తొలుత బిషప్ చర్చిలో కొవ్వొత్తులు వెలిగించి, బాలఏసు స్వరూపాన్ని ముద్దాడారు. భక్తులకు దివ్య సత్ప్రసాదాన్ని పంపిణీ చేశారు.




విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న ఫిరంగిపురం బాల ఏసు చర్చి


సాగు సంఘాలకు సవాళ్లు

సంఘాలదే బాధ్యత

సాగునీటి సంఘాలు నీటి సరఫరాలో కీలకం కానున్నాయి. నీటి సరఫరా సమస్యలపై అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రమే. సంఘాలు నిత్యం రైతులకు అందుబాటులో ఉంటాయి. ఏ కాల్వపై సమస్య తలెత్తినా వెనువెంటనే అధికారుల కంటే ముందు సంఘాలు హాజరయ్యే అవకాశం ఉంటుంది. ఎక్కడైనా కాల్వలకు గండి పడినా, కట్టలు పగిలిపోయినా.. నీటి పారుదలకు అవరోధాలు ఏర్పడినా వెంటనే సంఘాలు స్పందించి సమస్యలను పరిష్కరించాలి. మైనర్.. సబ్ మైనర్.. చిన్న చిన్న కాల్వలకు ఏ సమయంలో నీరు విడుదల చేయాలి, ఎప్పుడు నిలుపుదల చేయాలన్న అవగాహన సంఘాలదే. సంఘాలు పటిష్ఠంగా పనిచేస్తే నీటి కష్టాల నుంచి రైతులు గట్టెక్కే అవకాశం ఉంటుంది.



పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్‌లో పెరిగిన కంప చెట్లు



షట్టర్లు లేని తూములు

కాల్వలన్నీ శిథిలం

మేజర్లు, మైనర్‌లు, సబ్‌మైనర్ కాల్వలు శిథిలస్థితికి చేరుకున్నాయి. కాల్వల్లో కంప చెట్లు పెద్దఎత్తున పెరిగాయి. సాగునీటి కాల్వల నిండా జమ్ము, తూటుకాడ, రబ్బరు మొక్కలు అల్లుకుపోయాయి. కాల్వల నిండా నాచు పెరుగుతున్నది. నీటి సరఫరాకు అవరోధంగా ఉంది. డ్రాపులు పగిలిపోయాయి. షట్టర్లు దెబ్బతిన్నాయి. మైనర్లకు నీటిని సరఫరా చేసే తూములకు కనీసం షట్టర్లు కూడా లేవు. నీటి సరఫరాలో నియంత్రణ లేక నీరంతా వృథాగా పోతోంది. ఐదేళ్లు నిధుల లేక మరమ్మతులు జరగక కాల్వలన్నీ పాడుబడ్డాయి. తట్ట పూడిక తీసిన పాపాన పోలేదు. ఎన్నికలు నిర్వహించకుండా నీటి సరఫరాలో సాగు నీటి సంఘాల భాగస్వామ్యం లేకుండా చేయడంతో కాల్వల అధ్వానంగా మారాయి.

కాల్వలు శిథిలం.. సాగునీటి పారుదల వ్యవస్థ అధ్వానం.. ఐదేళ్లు... ఒక్క కాల్వపై మరమ్మ తులు చేసింది లేదు. కట్టలకు గండ్లు పడినా.. షట్టర్లు దెబ్బతిని నీరు వృథాగా పోతున్నా.. తూములు, కల్వర్టులు శిథిలమైపోయినా పాలకులకు పట్టలేదు. కాల్వల నిండా నీరున్నా చివరి భూములకు అందక రైతులు అల్లాడుతున్నారు.. పంటలకు ఊపిరిపోసే నీరంతా వృథా.. ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగునీటి కోసం రైతులు అల్లాడిపోయారు. నీటి పారుదల వ్యవస్థను విస్మరించిన పాలకులు సాగునీటి సంఘాల ఎన్నికలను మరిచారు. దీంతో రైతులు సాగునీటి కష్టాలతో ఐదేళ్లు అల్లాడిపోయారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఇటీవలే ఎన్నికలు నిర్వహించింది. దీంతో రైతులు తమ కష్టాలు తీరినట్లేనని భావిస్తున్నారు. అయితే సాగునీటి సంఘాలకు ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించి రైతుల ఆశలను నెరవేర్చాల్సిన బాధ్యత వారిపై ఉంది.

- షట్టర్లు లేవు.. పూడికతీత మరిచారు
- ఐదేళ్లుగా కాల్వలకు పైసా విదల్చలేదు
- నీటి పారుదలపై గత పాలకుల నిర్లక్ష్యం
- కాల్వల నిండా నీరున్నా పంటల సాగు జాప్యం
- కాల్వల బాగుకు నీటి సంఘాలు నడుం కట్టాలి



రూపురేఖలు కోల్పోయిన గోవిందాపురం మైనర్ కాలువ



గోవిందాపురం మైనర్‌లో పెరిగిన తూటికాడ మొక్కలు



చిలకలూరి పేట మేజర్ కాలువలో పెరిగిన కంప

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కాల్వల ఎగువన పుష్కలంగా నీరున్నా చివరి భూములకు చుక్క నీరందిందిలేదు. సాగునీరులేక రైతులు పొలాలను ఎడారిగా వదిలేశారంటే కాల్వల దుస్థితి ఏవిధంగా అర్థం చేసుకోవచ్చు. ఐదేళ్లలో కాల్వల్లో పూడికతీత తీసిన దాఖలాలే లేవు. ఎక్కడా ఒక్క కరకట్ట పటిష్ఠతకు చర్యలు తీసుకున్న జాడే లేదు. పైగా వాగులు, వంకలను కూడా వదిలిపెట్ట కుండా మట్టి మాఫియా తయారై కట్టలను కూడా యథే చ్ఛగా లూటీ చేసిన ఘనత గత పాలకులది. సకాలంలో నీరందక వేల ఎకరాల్లో పంట ఎండిపోతున్నా చూస్తూ మౌనంగా రోధించాల్సిన స్థితినే అన్నదాత ఎదుర్కొన్నాడు. చిన్నపాటి వర్షాలకే మురుగు కాల్వలు పొంగి చేలను ముంచేసినా పట్టించుకున్న వారు లేరు. కాల్వల అత్యవ సర మరమ్మతుల కోసం ఐదేళ్లలో ఒక్క పైసా కూడా మంజూరు చేసిందేలేదు. రైతులు చెల్లించే నీటితీరువా మొత్తాలలో దామాషా ప్రకారం విడుదల చెయ్యాల్సిన నిధులనుకూడా ఇచ్చిందిలేదు. జలాశయాల్లో నీటి నిల్వలూ అంతంతమాత్రంగా ఉంటే, కనీసం పట్టిసీమను కూడా సరిగా వినియోగించుకోలేని అసమర్థత రైతుల పాలిట శాపంగా మారింది. ఆ ఐదేళ్ల పాపం ఇప్పుడు సాగునీటి సంఘాలకు కొత్తగా ఎన్నికైన అధ్యక్షుల ముందు సవాళ్లను నిలిపింది. కృష్ణా పశ్చిమ డెల్టాలో కొమ్మమూరు, పశ్చిమ బ్యాంక్ కెనాల్, తూర్పు, పశ్చిమ కాల్వలు, నిజాంపట్నం కాల్వల ద్వారా, వాటి పంటకాల్వల ద్వారా నీరందుతుంది. అయితే ప్రధాన కాల్వలే కాకుండా ప్రతి పంట కాల్వపైనా మరమ్మతులు చెయ్యాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో సాగునీటి సంఘాలకు ప్రతి కాల్వపైనా అజమాయిషీ ఉండేది. ప్రతి అడుగు వదలకుండా రైతులు కాల్వలపై ఇబ్బందులను చెప్పేవారు కనుక మరమ్మతులు చేయడం కూడా తేలిక య్యేది. రైతులే పనులు

(మిగతా 7వ పేజీలో)

కబ్జాదారుల చెరలో కాల్వలు

పల్నాడు జిల్లాలో నీటి పారుదల కాల్వలు, వాగులు, చెరువులను రియల్ వ్యాపారులు కబ్జా చేస్తున్నారు. వెంచర్లకు అడ్డు వస్తున్న కాల్వలు, వాగులను పూడ్చేస్తూ ఆ స్థలాలను లేఅవుట్లలో కలిపేసుకుంటు న్నారు. రియల్ వెంచర్ ఏర్పాటు చేసిన వారు ఇష్టారా జ్యంగా సాగునీటి కాల్వలను కూడా మళ్లిస్తున్నారు. నరసరావుపేట 10 ఆర్ మైనర్ కాల్వ కనుమరుగవు తోంది. ఈ కాల్వ కట్టలు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. రియల్ వ్యాపారులు ఈ కాల్వ స్థలాన్ని కబ్జా చేశారు. చాలా చోట్ల ఇదే పరిస్థితి. పంట కాల్వలపై జనవనరుల శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడింది అధికారులు అక్రమార్కుల పంచన చేరిపోయారన్న విమర్శలున్నాయి. కబ్జాకు గురైన కాల్వలను గుర్తించి సంఘాలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వీడని వర్షం.. నేలవాలిన వరి

జిల్లాలో 170.2 మీ.మీ వర్షపాతం నమోదు

నరసరావుపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాను వర్షాలు వీడటం లేదు. రెండు రోజులుగా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో పంటలు దెబ్బతింటున్నాయి. కోత దశలో ఉన్న వరి వర్షానికి నేలవాలి నీటిలో నానుతుంది. నూర్పిడి చేసిన ధాన్యం చేలల్లోనే ఉంది. పట్టలు కప్పి వర్షానికి తడవకుండా ధాన్యాన్ని రైతులు కాపాడుకుంటున్నారు. చేతికి అందివచ్చిన పంట వర్షానికి తడిచిపోతుండటంతో అన్నదాతలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. జిల్లా అంతటా 170.2 మీ.మీ వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ బుధ వారం వెల్లడించింది. వర్షాల వలన మిరప, పత్తి, మొక్కజొన్న, శనగ, పొగా కు పంటలకు నష్టం వాటిల్లుతోందని రైతులు చెబుతున్నారు. ఇంతటితో వర్షాలు ఆగితే పంటలు చేతికి వచ్చే అవకాశం ఉంది. లేకుంటే పూర్తిగా పంటలను కోల్పోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట రైతుల లోగిళ్ల చేరే సమయంలో వర్షాలు కురుస్తుండటంతో రైతులకు కంటిపై కునుకు ఉండటం లేదు. వర్షం కొనసాగితే పంటలు ఉరకెత్తే ప్రమాదం ఉంది. వర్షాలు ఆగిపోవాలని రైతులు వరుణుడిని వేడుకుంటున్నారు. జిల్లాలోని 28 మండలాల్లో వర్షపాతం నమోదైంది. మూడు మండలాల్లో ఒక సెం.మీ కన్నా అధికంగా వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో ఒక సెం.మీ కన్నా తక్కువగా వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



నరసరావుపేట ప్రాంతంలో నీటిలో నానుతున్న వరి

7

హాస్టళ్లలో భద్రత డొల్ల

● వసతి గృహాల్లో విద్యార్థినుల పర్యవేక్షణ శూన్యం

యువతి కిడ్నాప్‌కు యత్నం

7

● ఆటోలో నుంచి దూకి పరిగెత్తిన వైనం

శ్రీతేజ్ కుటుంబానికి రూ.2 కోట్ల సాయం

(మొదటి పేజీ తరువాయి)

చికిత్స పొందుతున్న రేవతి కుమారుడు శ్రీతేజ్‌ను బుధవారం దిల్ రాజుతో కలిసి అల్లు అరవింద్ మరోసారి పరామర్శించారు శ్రీతేజ్ ఆరోగ్యంపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద అల్లు అరవింద్ మాట్లాడుతూ.. శ్రీతేజ్ కోలుకుంటున్నాడని, అతని ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉన్నట్లు వైద్యులు చెప్పారని తెలిపారు. శ్రీతేజ్ శరీరంలో పూర్తి స్థాయిలో కదలికలు వచ్చాయని చెప్పారన్నారు. అతని ఆరోగ్యం పూర్తిస్థాయిలో మెరుగు పడేంతవరకు అన్నిరకాల వైద్య చికిత్సలు అందించడానికి తమవైపు నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. శ్రీతేజ్ త్వరగా కోలుకుని మనందరితో కలిసి తిరుగుతాడని ఆశిస్తున్నట్లు చెప్పారు. వారి కుటుంబానికి చేయదలచుకున్న ఆర్థిక సాయానికి సంబంధించి ప్రభుత్వ ప్రతినిధిగా దిల్ రాజుకు అందజేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఆ కుటుంబానికి ఏ కష్టం వచ్చినా తాము అండగా ఉంటామన్నారు.

నేడు సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తున్నాం..

శ్రీతేజ్ కోలుకుంటున్నాడని, వెంటిలేటర్, ఆక్సిజన్ లేకుండా 72 గంటలుగా శ్వాస తీసుకోగలుగుతున్నాడని ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు తెలిపారు. అతని కుటుంబానికి అల్లు అర్జున్, నిర్మాతలు, దర్శకుడి తరఫున రూ.2 కోట్ల సాయం అందజేశామన్నారు. గురువారం సినీ పరిశ్రమకు చెందిన పెద్దలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తున్నామని చెప్పారు. సీఎం అపాయింట్‌మెంట్ ఇచ్చారని తెలిపారు. ఉదయం 10 గంటలకు బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించనున్న ఈ సమావేశంలో సినీ పరిశ్రమ ప్రధాన సమస్యలపై చర్చించనున్నారు. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను బుధవారం కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ పరామర్శించారు. సినిమా కొరియోగ్రాఫర్స్ అసోసియేషన్ తరఫున అండగా ఉంటామని చెప్పారు.

జానీ మాస్టర్ లైంగిక వేధింపులు నిజమే

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సినీ నృత్య దర్శకుడు జానీ మాస్టర్ కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. అతను తన వద్ద పనిచేసిన సహాయ నృత్య దర్శకురాలిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు చార్జిషీట్ దాఖలు చేశారు. జానీ మాస్టర్ ఆమెను ఈవెంట్ల పేరుతో పలు ప్రాంతాలకు తీసుకువెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. బాధిత యువతి సెప్టెంబరు 15న పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. నార్సింగ్ పోలీసులు జానీ మాస్టర్‌ను అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించగా, కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో అక్టోబరు 25న విడుదలయ్యాడు.

జనవరి 21న కృష్ణా బోర్డు భేటీ

అమరావతి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సమావేశం వచ్చే నెల 21వ తేదీన జరుగనుంది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు బోర్డు సమాచారం పంపింది. బోర్డు ఆర్థిక వ్యవహారాలు, రెండు రాష్ట్రాలూ ఇవ్వాల్సిన నిధులు, బోర్డు విధివిధానాల ఖరారు, అమరావతికి బోర్డు తరలింపును ఉమ్మడి ఎజెండాలో చేర్చింది. ఆంధ్రప్రదేశ్ ఆరు చర్చనీయాంశాలను ప్రతిపాదించింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను కేంద్ర జలశక్తి శాఖ తెలంగాణకు తిప్పి పంపిన నేపథ్యంలో ఈ భేటీలో బోర్డు ఏం చెబుతుందన్నది ఆసక్తికరంగా మారింది. అలాగే బోర్డు కార్యాలయాన్ని అమరావతికి తరలిస్తామని ఇటీవల జలశక్తి శాఖ తెలిపింది. 21న జరిగే భేటీలో అయినా దీనిని తేల్చుతారా.. ఎప్పటి మాదిరిగానే దాటవేస్తారా అనే సందేహం నెలకొంది. విభజన చట్టం ప్రకారం ఏనాడో విజయవాడలో కేఆర్ఎంబీ ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ అప్పట్లో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్.. కృష్ణా నదితో ఎలాంటి సంబంధమూ లేని విశాఖకు ఈ కార్యాలయాన్ని తరలించాలని ప్రతిపాదించారు. దీనిని కేఆర్ఎంబీ కూడా గుడ్డిగా సమర్థించింది.

అమ్మ వచ్చింది!

పాతికేళ్ల తర్వాత కలుసుకున్న తల్లీపిల్లలు

- ఉద్వేగంతో ఉబ్బితబ్బిబ్బయిన కుటుంబం
- పెళ్లికి వెళ్లి తప్పిపోయిన సాకమ్మ
- అధికారుల చొరవతో నిరాశ్రయుల కేంద్రం నుంచి ఇంటికి



ఎయిర్‌పోర్టులో తల్లిని హత్తుకుని విలపిస్తున్న కుమారులు

ఇరవై ఐదేళ్ల క్రితం అదృశ్యమైన అమ్మ... ఒక్కసారిగా కళ్లముందు ప్రత్యక్షం. అంతే, ఆ పిల్లలు ఉద్వేగానికి గురయ్యారు...కట్టలు తెంచుకుని వచ్చిన కన్నీళ్లను తుడుచుకుని కన్నతల్లిని హత్తుకున్నారు. వారిని చూడగానే ఆ తల్లి పరిస్థితీ అంతే...పిల్లలను ఈ జన్మలో చూస్తానో చూడనో అంటూ తపించి, తల్లడిల్లుతున్న మాతృహృదయానికి ఎట్టకేలకు సాంత్వన చేకూరింది.

సాకమ్మ... పాతికేళ్ల క్రితం కర్ణాటక రాష్ట్రం హొసపేటలో బంధువుల ఇంట పెళ్లికి వెళ్లి పొరబాటున వేరే రైలు ఎక్కేశారు. ఆరైలు రాష్ట్రాల సరిహద్దులు దాటిపోయింది. రైలు దిగి ఎక్కడెక్కడో తిరిగి సాకమ్మ హిమాచల్‌ప్రదేశ్ చేరారు. అక్కడి అధికారులు అనాథ మహిళగా భావించి, మండి జిల్లా నిరాశ్రయుల కేంద్రంలో చేర్పించారు. ఆమెకు మతిస్థిమితం కాస్త సరిగా లేకపోవడంతో ఇలా జరిగింది. ఆమె కనబడకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ తరువాత ఎనిమిది రోజులకు గుర్తు తెలియని మహిళ మృతదేహం చిక్కినట్టు పోలీసులు తెలపడంలో వెళ్లి చూసి, సాకమ్మదే అని భావించి అంత్యక్రియలు కూడా నిర్వహించారు.

ఆ అధికారి చొరవతో..: కర్ణాటకలోని మండ్య జిల్లాకు చెందిన ఐపీఎస్ అధికారి రవినందన్ ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్‌లో పనిచేస్తున్నారు. ఆయన సాకమ్మ గురించి తెలుసుకుని, బెంగళూరులోని తన స్నేహితులకు వీడియో పంపించారు. వారు సాకమ్మ వీడియోను ఎక్స్‌లో పోస్టు చేశారు. దీనికి కర్ణాటక సాంఘిక సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి పి.మణియణ్ణన్ స్పందించారు. ఐపీఎస్ అధికారి రవినందన్‌ను సంప్రదించి, సాకమ్మ వివరాలను సేకరించారు. ఆమె బళ్లారివాసి అని తెలుసుకుని, ఇక్కడి అధికారులకు సమాచారం అందించారు. ప్రస్తుతం ఆమె కుటుంబ సభ్యులు, పిల్లలు బళ్లారి నగరంలోని గుగ్గరహట్టిలో ఉన్నట్టు గుర్తించారు. హిమాచల్‌ప్రదేశ్‌కు అధికారుల బృందం వెళ్లి..వీడియో కాల్ చేసి కుమారుడు విరాట, కూతురు లక్ష్మిని సాకమ్మకు చూపించి, మాట్లాడించారు. ఆమెను చూసి గుర్తుపట్టిన ఆ కుటుంబం ఆనందానికి హద్దులు లేకుండా పోయింది. అధికారుల బృందం ఆమెను హిమాచల్ ప్రదేశ్ నుంచి విమానంలో మంగళవారం రాత్రి బెంగళూరుకు తీసుకు వచ్చింది. అప్పటికే ఎయిర్ పోర్టుకు చేరుకున్న సాకమ్మ ఇద్దరు కుమారులు తల్లిని చూడగానే ఉద్వేగంతో కన్నీళ్లు పెట్టుకున్నారు. సంక్షేమ శాఖ ఉన్నతాధికారి మణియణ్ణన్ బుధవారం సాకమ్మను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రత్యేక వాహనంలో వారంతా స్వస్థలానికి బయలుదేరారు.

-బళ్లారి గాంధీనగర్, ఆంధ్రజ్యోతి

వర్షం రాకతో కొత్త పెట్టె కొనుగోలు!

- పార్శిల్‌లో మృతదేహం కేసులో కొత్త కోణాలు
- ఆస్తి కోసం అక్కనే బెదిరించేందుకు చెల్లెలు, మరిది పన్నాగాలు



గాంధీనగర్‌లోని నిందితుని ఇంటి వద్ద ఉన్న మరో చెక్క పెట్టె

భీమవరం క్రైం/ఉండి/కాళ్ల, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం యండగండిలో కలకలం రేపిన 'పార్శిల్‌లో మృతదేహం డోర్ డెలివరీ' కేసులో కొత్తకోణాలు వెలుగు చూస్తున్నాయి. ఇప్పటికే ప్రధాన నిందితుడిగా భావిస్తున్న సాగి తులసి మరిది తిరుమాని శ్రీధర్‌వర్మ(అలియస్ సుధీర్ వర్మ, అలియాస్ సిద్ధార్థ వర్మ) పోలీసుల అదుపులో ఉన్నాడు. శ్రీధర్‌వర్మ కాళ్ల గ్రామ శివారు గాంధీనగర్‌కు చెందిన బర్రె పర్లయ్యను హత్య చేసి బాక్సులో పెట్టి.. యండగండికి పంపించిన ఘటనలో తులసి చెల్లెలు అయిన రెండో భార్య.. రేవతి పూర్తి సహకారం అందించినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. మూడో భార్య సుష్మ కూడా సహకారం అందించినట్లు భావిస్తున్నారు.

హత్య కేసుగా మార్పు

ఈ నెల 17న బర్రె పర్లయ్యను హత్య చేసేందుకు శ్రీధర్ వర్మ పక్కా ప్రణాళికతో చెక్క పెట్టెను సిద్ధం చేసుకున్నాడు. మద్యం తాపించి ఉండి మండలం వాంద్రం గ్రామ సమీపంలో హత్య చేశాడు. మృతదేహాన్ని చెక్కపెట్టెలో పార్శిల్ చేయడానికి గాంధీనగర్ తీసుకువెళుతుండగా వర్షం కురవడంతో, కారు ముందుకు వెళ్లే అవకాశం లేకపోయింది. దీంతో శవాన్ని కారులోనే ఉంచి, మరొక పెట్టెను కైకలూరు నుంచికొని తెచ్చాడు. అనంతరం మృతదేహాన్ని గణపవరం మండలం సాగిపాడు వద్దకు పెట్టెలో తీసుకువెళ్లి మూడో భార్య సుష్మ సాయంతో ఆటోకు అప్పగించి తులసికి డోర్ డెలివరీ చేశారు. ఇప్పటి వరకు అనుమానాస్పద కేసుగా ఉంచిన పోలీసులు బుధవారం దీనిని హత్య కేసుగా మార్పు చేశారు. తులసికి చెందిన ఆస్తిని కాజేయడం కోసమే శ్రీధర్‌వర్మ, అతడి రెండో భార్య రేవతి పన్నాగం పన్నారని పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. శ్రీధర్ వర్మ రెండో భార్య రేవతి భీమవరంలోని పలు నగల దుకాణాల్లో బంగారం తాకట్టు పెట్టి, మరికొంత విక్రయించినట్లు తెలియడంతో బుధవారం మూడు బంగారం దుకాణాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. గాంధీనగర్‌లో మొదటి భార్య ఇంట్లో క్షుద్రపూజలకు సంబంధించిన కొన్ని వస్తువులు, పుస్తకాలు పోలీసులకు దొరికాయి. కృష్ణా జిల్లా మల్లంపూడిలో శ్రీధర్ వర్మ తల్లిదండ్రులను, ఆయన ముగ్గురు భార్యలు, పిల్లలు, యండగండికి చెందిన ముదునూరి రంగరాజు, అతడి భార్య హైమావతి, సాగి తులసిలను పోలీసులు వేర్వేరుగా పలు ప్రదేశాల్లో విచారిస్తున్నారు. ఒకట్రెండ్రోజుల్లో వివరాలు పూర్తిగా వెల్లడిస్తామని జిల్లా ఎస్పీ నయీం అస్మి తెలిపారు.

కర్త, కర్మ, క్రియ.. కేటీఆరే!

ఆయన ఆదేశాలతోనే నిధుల మళ్లింపు.. సీనియర్ ఐఏఎస్ దానకిషోర్ వాంగ్మూలం!

ఫార్ములా-ఈ రేసు కేసులో కీలక పరిణామం.. నాలుగు గంటల పాటు ప్రశ్నించిన ఏసీబీ



దానకిషోర్

హైదరాబాద్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు కేసులో కేటీఆర్‌కు ఉచ్చు బిగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాతపూర్వక ఫిర్యాదు ఇచ్చిన ఐఏఎస్ అధికారి దానకిశోర్ వాంగ్మూలాన్ని ఏసీబీ అధికారులు రికార్డు చేసి కీలక ఆధారాలు సేకరించారు. రేసుకు సంబంధించి నాటి ప్రభుత్వానికి, బ్రిటన్‌కు చెందిన ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో) సంస్థకు మధ్య జరిగిన ఒప్పందాలు, ఇన్‌వాయిస్‌లు, 2023 సెప్టెంబరు 27న నాటి పురపాలకశాఖ ప్రత్యేక కార్యదర్శి అర్వింద‌కుమార్ నాటి మంత్రి కేటీఆర్‌కు పంపిన ఫైల్ ప్రతులను ఏసీబీ అధికారులు తీసుకున్నారు. మంగళవారం సాయంత్రం దాదాపు నాలుగు గంటల పాటు దానకిశోర్‌ను ప్రశ్నించారు. ప్రస్తుతం తమకు అందుబాటులో ఉన్న ఫైళ్ల ప్రకారం నిధుల మళ్లింపు అంతా నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని.. దీనికి కర్త, కర్మ, క్రియ అంతా నాటి పురపాలక శాఖ మంత్రి కేటీఆరేనని దానకిషోర్ స్పష్టం చేసినట్లు సమాచారం. నిధులు విడుదల చేయడం పూర్తిగా నిబంధనల ఉల్లంఘనేనని, అనుమానాస్పద వ్యవహారమని ఆయన పేర్కొన్నట్లు తెలుస్తోంది. కేటీఆర్ ఆదేశాల మేరకే తాను నిధులను పంపానని అర్వింద‌కుమార్ అంగీకరించిన విషయాన్ని దానకిశోర్ అధికారులకు చెప్పినట్లు తెలిసింది. అర్వింద‌కుమార్ అప్పట్లో పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో ఉండడంతో సీఎస్‌ని కూడా పరిగణనలోకి తీసుకోకుండా ఫైళ్లను నడిపించారని తెలుస్తోంది. ఈ క్రమంలో అర్వింద‌కుమార్‌ను విచారించిన తర్వాతే కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వాలని ఏసీబీ అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకటిరెండు రోజుల్లో అర్వింద‌కుమార్‌కు నోటీసులు ఇవ్వనున్నట్లు సమాచారం. అయితే హైకోర్టు కేటీఆర్‌కు ఇచ్చిన గడువు ఈ నెల 30న ముగుస్తుండడంతో ఆ తర్వాతే నోటీసులకు వెళ్లాలా? అని కూడా ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ కేసు నుంచి తనను బయటపడేయాలని, అరెస్టు వరకు వెళ్లకుండా చూడాలని అర్వింద‌కుమార్ ప్రభుత్వానికి సందేశాలు పంపుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన్ను అప్రూవర్‌గా మార్చుకొని దర్యాప్తులో ముందుకు వెళ్లే యోచన కూడా చేస్తున్నట్లు సమాచారం.

దిశ మార్చుకున్న తీవ్ర అల్పపీడనం

- నేడు బలహీనపడుతుందన్న వాతావరణశాఖ
- కోస్తా జిల్లాలకు వర్షసూచన.. పెరిగిన చలి

విశాఖపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నైరుతి, దానికి ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉన్న తీవ్ర అల్పపీడనం దిశ మార్చుకుంది. మంగళవారం వరకూ పశ్చిమ నైరుతిగా పయనించిన తీవ్ర అల్పపీడనం తరువాత వాయవ్యంగా పయనిస్తోంది. బుధవారం మధ్యాహ్నానికి దక్షిణ తమిళనాడు, ఉత్తర తమిళనాడుకు సమీపంలో కొనసాగుతోంది. గురువారం నాటికి వాయవ్యంగా పయనించి పశ్చిమ మధ్య, దానికి ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో ప్రవేశించే క్రమంలో అల్పపీడనంగా బలహీనపడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో కోస్తాలో అనేకచోట్ల బుధవారం ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. తీవ్ర అల్పపీడనం ప్రభావంతో సముద్రం మీదుగా గాలులు వీయడం, చిరుజల్లులు కురుస్తుండడంతో కోస్తాలో చలి వాతావరణం కొనసాగింది. అన్ని ఓడరేవుల్లో మూడో నంబరు భద్రతా సూచిక కొనసాగుతుంది. గురువారం కోస్తాలో పలుచోట్ల, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు, నెల్లూరు జిల్లాలో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, ఆగ్నేయ బంగాళాఖాతం నుంచి తేమగాలులు బలంగా రావడంతో ప్రస్తుతం పశ్చిమ మధ్య, దానికి ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో ఉన్న తీవ్ర అల్పపీడనానికి అవసరమైన తేమ లభిస్తోందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు.



మలయాళ రచయిత వాసుదేవన్ నాయర్ కన్నుమూత



ప్రముఖ మలయాళ రచయిత, సినీ దర్శకుడు ఎంటీ వాసుదేవన్ నాయర్ (91) బుధవారం రాత్రి కొళిక్కోడ్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో గుండెపోటుతో కన్నుమూశారు. వయోభారం వల్ల వచ్చిన అనారోగ్య సమస్యలతో ఆయన కొంతకాలంగా చికిత్స పొందుతున్నారు. పాలక్కాడ్ సమీపంలోని కడలూరు ఆయన సొంతూరు. వాసుదేవన్ నాయర్‌కు బాల్యం నుంచే మలయాళ సాహిత్యంపై ఆసక్తి కలిగింది. ఆయన కలం నుంచి జాలువారిన బాల సాహిత్యం, కథలు, పర్యాటక రచనలు, వ్యాసాలు, నవలలు మలయాళ సాహిత్యంలో ప్రత్యేక స్థానం పొందాయి. 'నాలుకెట్టు, అసురవిత్తు, మంజు, సర్పవిత్తు' తదితర రచనలు విశేష పాఠకాదరణ పొందాయి. కొంతకాలం ఉపాధ్యాయుడిగా పనిచేసిన తర్వాత మలయాళ సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన వాసుదేవన్ 54 చిత్రాలకు స్ర్కీన్‌ప్లే అందించారు. ఏడు సినిమాలకు దర్శకత్వం వహించారు. ఆయన దర్శకత్వం వహించిన 'నిర్మాల్యం', 'కడవు' సినిమాలకు ఉత్తమ చిత్రం విభాగంలో జాతీయ చలనచిత్ర పురస్కారాలు దక్కాయి. ఇప్పటివరకూ ఉత్తమ స్ర్కీన్‌ప్లే రచయితగా నాలుగుసార్లు జాతీయ అవార్డు అందుకున్న అరుదైన ఘనతను ఆయన సొంతం చేసుకున్నారు. వాసుదేవన్ రాసిన తొమ్మిది కథల ఆధారంగా తెరకెక్కిన 'మనోరథంగల్' వెబ్‌సిరీస్ ఈ ఏడాది ప్రముఖ ఓటీటీలో విడుదలై ప్రేక్షకాదరణ పొందింది. ఆయన పైన గౌరవంతో ఈ సిరీస్‌కు కమల్‌హాసన్ సమర్పకుడిగా వ్యవహరించగా, మోహన్‌లాల్, మమ్ముట్టి, ఫహద్ ఫాజిల్ లాంటి పలువురు అగ్రతారలు నటించారు. 1996లో జ్ఞానపీఠ్, 2005లో పద్మభూషణ్, 2013లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలను ఆయన అందుకున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ కార్య నిర్వాహక సభ్యుడుగా, కేరళ సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా, ఇండియన్ పనోరమ చైర్మన్‌గా ఆయన సేవలందించారు. కొంతకాలం మాతృభూమి వారపత్రికకు సంపాదకుడిగానూ ఆయన విధులు నిర్వర్తించారు. వాసుదేవన్ నాయర్ మృతి పట్ల కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ సహా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

హిట్ అవుతుందని ప్రభాస్ చెప్పారు

హీరో ధర్మ



ధర్మ, ఐశ్వర్య శర్మ జంటగా నటించిన యూత్‌ఫుల్ ఎంటర్టైనర్ 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' అనేది ఉపశీర్షిక. కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో బసవరాజు లహరిధర్, బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 27న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి మాట్లాడుతూ "ఈ సినిమా కచ్చితంగా మీ అందర్నీ కదిలిస్తుంది. ధర్మకు ఉత్తమ పరిచయ నటుడిగా అవార్డు రావడం పక్కా. కథను నమ్మి నిజాయితీగా చేసిన ప్రయత్నం ఈ సినిమా. చివరి 40 నిమిషాలు సినిమాకు ప్రధానాకర్షణ" అని చెప్పారు. "ఈ సినిమాను నిర్మించే విషయంలో నిర్మాతలు ఎక్కడా రాజీ పడలేదు. నా అభిమాన హీరో ప్రభాస్‌ను కలసినప్పుడు ఈ సినిమాకు ఆల్ ద బెస్ట్ చెప్పారు. "సినిమా బాగా వచ్చింది. టీజర్, ట్రైలర్ చూసిన ప్రతీ ఒక్కరూ కంటెంట్ బాగుందని మెచ్చుకుంటున్నారు" అని తెలిపారు.





అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటా

- ఇన్‌చార్జ్ ఎంపీపీ జబీన్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీపీ జబీన్

దుగ్గిరాల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీకి చెందిన తనకు అన్ని అర్హతలున్నప్పటికీ బీసీ ధ్రువీకరణ పత్రం అందించకపోవడంతో ఎంతో మానసిక వేదనకు గురయ్యానని ఇన్‌చార్జ్ ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. మంగళవారం ఆన్‌లైన్ ద్వారా సచివాలయంలో బీసీ ధ్రువీకరణ పత్రం అందుకున్న జబీన్ బుధవారం చిలువూరులో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జబీన్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తనకు బీసీ ధ్రువీకరణపత్రం రాకుండా అడ్డుకున్నారనీ, రెవెన్యూ అధికారులు వత్తాసు పలికారని ఆరోపించారు. ధర్మం గెలిచింది, నిరీక్షణ ఫలించిందంటూ ఉద్వేగానికి గురయ్యారు. కోర్టు, తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగాననీ, అన్యాయంగా బీసీ ధ్రువీకరణ పత్రాన్ని తిరస్కరించారని వివరించారు. మహిళవని అధైర్య పడాల్సిన అవసరమే లేదనీ, రానున్నది మన ప్రభుత్వమేననీ, అన్నింటికీ కాలమే సమాధానం చెబుతుందని నేటి మంత్రి నారా లోకేశ్ ఎంతగానో ప్రోత్సహించారని తెలిపారు. మాటకు కట్టుబడిన కూటమికి చెందిన ఎంపీటీసీ సభ్యులందరూ ఎలాంటి బెదిరింపులకు, ప్రలోభాలకు లొంగకుండా తన వెంట నిలబడ్డారని, తనకు అండగా నిలిచిన ప్రతి నాయకునికి, కార్యకర్తకూ, తనకు ఓటువేసి గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యురాలు రోజ మరియమ్మ, తెదేపా గ్రామ అధ్యక్షుడు తోటకూర సీతారామయ్య, చిలువూరు శేషగిరిరావు, ఏనుపాదం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

- భార్యకు తీవ్రగాయాలు

నకరికల్లు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అద్దంకి - నార్కెట్‌పల్లి ప్రధాన రహదారిలో నకరికల్లు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక వైపు నుంచి వచ్చిన లారీ బుధవారం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భర్త మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. నకరికల్లు మండలం, చీమలమర్రి గ్రామానికి చెందిన తోక కొండయ్య, వెంకాయమ్మ భార్యభర్తలు. వీరు ఇద్దరూ తమ కుమారుడిని బస్సు ఎక్కించేందుకు చల్లగుండ్ల సున్నపు బట్టి వద్దకు వచ్చారు. కుమారుడిని బస్సు ఎక్కించిన అనంతరం పని మీద నకరికల్లు బయలుదేరారు. నకరికల్లులో కూరగాయలు తీసుకొని రోడ్డు దాటుతుండగా అదే అదే సమయంలో పిడుగురాళ్ల నుంచి నరసరావుపేట వైపు వెళ్లే ఆర్టీసీ బస్సు ప్రయాణికులను ఎక్కించుకొనేందుకు నిలిచింది. ఆ సమయంలో పిడుగురాళ్ల వైపు నుంచి అతి వేగంగా వస్తున్న లారీ ఆర్టీసీ బస్సును వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. ఈ క్రమంలో ఎదురుగా ఉన్న కొండయ్య, వెంకాయమ్మలను ఆర్టీసీ బస్సు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన కొండయ్య, వెంకాయమ్మను 108లో నరసరావుపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కొండయ్య(56)ను వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. వెంకాయమ్మ కాలికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స పొందుతుంది. ఎస్‌ఐ సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హాస్టళ్లలో భద్రత డొల్ల

- విద్యార్థినుల హాస్టళ్లపై పర్యవేక్షణ శూన్యం
- వరుస సంఘటనలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు



కలెక్టర్ బంగ్లా రోడ్డులోని పరివర్తన భవన్

గుంటూరు(విద్య), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరం నడిబొడ్డున ఒక కళాశాల హాస్టల్‌లో విద్యార్థినిని లైంగిక వేధింపులకు గురిచేసినా చర్యలు శూన్యం. సాక్షాత్తు నగర కమిషనర్ క్యాంపు కార్యాలయం పక్కన, జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఐజీ నివాసం ఉండే రోడ్డులోని హాస్టల్‌లో ఓ విద్యార్థి గర్భం దాల్చిన విషయం హాస్టల్ వార్డెన్, సంబంధిత అధికారులకు తెలియకపోవడం ప్రభుత్వ కళాశాల హాస్టళ్ల భద్రత డొల్లను బహిర్గతం చేస్తుంది.

పర్యవేక్షణ శూన్యం..

ఉమ్మడి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఆధ్వర్యంలో కళాశాల హాస్టళ్లను నిర్వహిస్తున్నారు. ఇంటర్ నుంచి డిగ్రీ వరకు విద్యను అభ్యసించే విద్యార్థినులు అక్కడ వసతి పొందుతూ సమీపంలోని కళాశాలల్లో చదువుకుంటూ ఉంటారు. అయితే విద్యార్థినుల హాస్టళ్ల పర్యవేక్షణను ఇటు వార్డెన్లు, అటు ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. ఉదయం, సాయంత్రం వచ్చి భోజనానికి అవసరమైన సరుకులు ఇచ్చి వెళ్లడం తప్పా, మిగతా విషయాలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. కనీసం నెలకు ఒకసారైన హాస్టళ్ల తనిఖీలు నిర్వహించడం లేదు. ఫలితంగా వార్డెన్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నియోజకవర్గ స్థాయిలో ఉన్న విద్యార్థినుల కళాశాల హాస్టళ్లను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. అక్కడ భద్రత విషయాలను పూర్తిగా పట్టించుకోవడం లేదు. నగరంలో కలెక్టర్ బంగ్లా రోడ్డు, అరండల్‌పేట, జూట్‌మిల్లు సమీపంలో, పట్టాభిపురం, పొన్నూరు రోడ్డు, చౌత్రా తదితర ప్రాంతాల్లో విద్యార్థినులకు కళాశాల హాస్టళ్లు ఉన్నాయి. వార్డెన్లలో కొంతమంది ఇతర ప్రాంతాల నుంచి వచ్చి విధులు నిర్వర్తిస్తున్నారు. పర్యవేక్షణ బాధ్యతల్ని వంట మనుషులు, కమాటీలకు అప్పగించడంతో హాస్టళ్లలో ఏం జరుగుతుంతో తెలియని దుస్థితి. జిల్లా స్థాయి అధికారులతోపాటు సంబంధిత శాఖల ఏఎస్‌డబ్ల్యువోలు కూడా పర్యవేక్షణ చేయడం లేదు.

- నాలుగు నెలల క్రితం నగరంపాలెంలోని స్టాల్ స్కూల్ ఆవరణలో ఉన్న కళాశాల హాస్టల్‌లో విద్యార్థినులను లైంగికంగా వేధిస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయి. హాస్టల్‌లో పనిచేసే సిబ్బందే మధ్యవర్తులుగా ఉండి వేధింపుల్ని ప్రోత్సహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో లైంగిక వేధింపుల్ని ప్రోత్సహించిన సిబ్బంది, వేధింపులకు పాల్పడిన వారిపై నామమాత్రపు చర్యలు తీసుకుని వదిలేశారు.
- మూడు నెలల క్రితం జూట్‌మిల్లుకు సమీపంలో ఉన్న ఓ హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థినుల్ని వైసీపీ సానుభూతి పరులు కిడ్నాప్ చేసి అడివితక్కెళ్ళపాడులోని రాజీవ్ గృహకల్ప సముదాయంలో బంధించడం రాష్ట్ర వ్యాప్తంగా కలకలం సృష్టించింది. కిడ్నాప్‌కు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోలేదు. అక్కడ పనిచేసే వార్డెన్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చి విషయాని వదిలేశారు.
- తాజాగా కలెక్టర్ బంగ్లా రోడ్డులోని పరివర్తన భవన్‌లో బీఫార్మసీ విద్యార్థిని గర్భం దాల్చింది. విద్యార్థిని హాస్టల్‌లోనే ఉంటున్నా, అక్కడి సిబ్బంది గానీ, వార్డెన్ గానీ గమనించకపోవడం పలు విమర్శలకు దారితీస్తుంది. సమీప బంధువు వల్ల గర్భం దాల్చినట్లు నివేదిక ఇచ్చిన అధికారులు లోతైన విచారణ చేపట్టలేదనే విమర్శలు ఉన్నాయి.
- కళాశాల హాస్టళ్ల సమీపంలో ఆకతాయిలు చక్కర్లు కొడుతున్నా పట్టించుకునే వారే లేరని స్థానిక ప్రజల నుంచి ఫిర్యాదులు ఉన్నాయి. కనీసం హాస్టల్ వార్డెన్ కూడా పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు. ఫలితంగా సాంఘిక, బీసీ, గిరిజన సంక్షేమ శాఖ కళాశాల హాస్టళ్లలో విద్యార్థిల్ని చేర్పించాలంటే తల్లిదండ్రులు భయాందోళనకు గురికావాల్సి వస్తుంది.

ఈనామ్‌పై అవగాహన ఏదీ?

- డేటా ఎంట్రీ ఆపరేటర్లపై ఆధార పడుతున్న అధికారులు



గుంటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ వ్యవసాయ మార్కెట్(ఈనామ్) విధానం గుంటూరు మిర్చియార్డులో అమల్లోకి వచ్చి ఏడేళ్లు పూర్తి అయినా దానికి సంబంధించి మార్కెటింగ్ అధికారులకు నామమాత్రంగా కూడా పరిజ్ఞానం లేదు. ఏ చిన్న విషయమైనా డేటా ఎంట్రీ ఆపరేటర్ల మీద ఆధార పడుతున్నారు. ప్రాథమిక అంశాలైన లాట్ ఐడీలను జనరేట్ చేయడం, బిడ్డింగ్ విధానం, సేల్ అగ్రిమెంట్ వంటివి కూడా తెలియవు. గత రెండు, మూడు నెలల నుంచి మిర్చియార్డులో అవినీతి, అక్రమాలపై ఆరోపణలు వెల్లువెత్తుతోండటం, రూ. 346 కోట్ల అవినీతి జరిగిందని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నివేదిక అందజేయడంతో మార్కెట్ కమిషనర్ విజయ సునీత ఈనామ్ లోపాలపై అధ్యయనం చేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. అయితే అసలు ఈనామ్‌పై అధికారులకే అవగాహన లేకపోవడంతో ఏ విధంగా నివేదిక ఇస్తారోనన్న అనుమానాలు కలుగుతున్నాయి. గుంటూరు మిర్చియార్డులో ఈనామ్ విధానం 2017 అక్టోబరు 9వ తేదీ నుంచి అమలులోకి వచ్చింది. మార్కెటింగ్ అధికారులు, సిబ్బంది, కమీషన్ ఏజెంట్‌లు, ఎక్స్‌పోర్టర్లు, వేమెన్‌లు ఎప్పటికప్పుడు వారి పనిని నెరవేరిస్తే ఈనామ్‌ను ఆన్‌లైన్‌లోనే నిర్వహించవచ్చు. అయితే ఎవరికి వారు తీరిక కుదిరినప్పుడు ఎంట్రీ చేస్తుండటంతో ఈనామ్ లక్ష్యం, ఉద్దేశం నీరుగారిపోతుంది. లోపాలను సరి చేసేందుకు ఎవరూ దృష్టి సారించడం లేదు. కాగా ఈనామ్ విధానంపై మార్కెటింగ్ అధికారులకు ముందుగా శిక్షణ తరగతులు నిర్వహించి అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉంది.

సాగు సంఘాలకు.. సవాళ్లు

(5వ పేజీ తరువాయి)

చేయించుకుంటారు కనుక నిధుల దుర్వినియోగం విషయం అటుంచితే, ప్రతి రూపాయి సద్వినియోగమయ్యేది. డెల్టా కాల్వల ఆధునికీకరణ సమయంలో కొమ్మమూరు కాల్వపై రూ.400 కోట్ల విలువైన పనులు జరగనేలేదు. ఆ నిధులు అప్పట్లో మురిగిపోయాయి. అయితే తర్వాత కాల్వ కట్టలు ఛిద్రమైపోయి గండ్లు పడటం, పంటలు దెబ్బతినటం షరామామూలైంది. బాపట్ల ప్రాంతంలో భారీ గండిపడినప్పుడు ప్రభుత్వం నిధులు సరిపడా ఇవ్వలేకపోవడం, పనులు సరిగా జరగక ఏటా ఇబ్బందులు ఎదురవుతూనే ఉన్నాయి. గండ్లు పడ్డాక పూడ్చడానికి మళ్లీ నిధులు కేటాయించి వాటినీ గత ప్రభుత్వంలో వైసీపీ నేతలే జేబుల్లో వేసుకునే పరిస్థితి. దీంతో రైతులకు ఐదేళ్ల కడ'గండ్లు' మాత్రం తప్పలేదు. నాగార్జున సాగర్ జవహర్ కుడి కాలువ 203 కిలోమీటర్లు పొడవున పల్నాడు, ప్రకాశం, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో విస్తరించింది. 11,11,410 ఎకరాలకు సాగు నీటిని అందిస్తోంది. అనేక బ్రాంచ్.. మేజర్.. మైనర్ కాల్వల ద్వారా 11,000 క్యూసెక్కుల నీరు సరఫరా చేసే సామర్థ్యం. ఇంతటి ప్రాధాన్యం ఉన్న సాగర్ కాల్వ పరిధిలో కూడా చివరి భూములకు సాగునీరు అందక రైతులు అల్లాడిపోయారు. ఈ పరిస్థితుల్లో ఇటీవల ఎన్నికైన సాగునీటి సంఘాలు ఎంతో బాధ్యతతో రైతుల ప్రయోజనాలను కాపాడుకుంటూ చివరి భూమి వరకు నీరు అందించే బృహత్తర కార్యక్రమం సంఘాలపై ఉంది. వైసీపీ హయాంలో నిర్వీర్యం అయిన సాగు నీటి వ్యవస్థను గాడిలో పెట్టేందుకు నీటి సంఘాలు కృషి చేయాలి. అప్పుడే ప్రభుత్వ ఏర్పాటు చేసిన నీటి సంఘాల లక్ష్యాలు నెరవేరుతాయి. సాగునీటి సంఘాల ద్వారా రైతులే కాల్వలను కాపాడుకునేలా నిధులు ఖర్చు చేసుకునే స్వేచ్ఛ వచ్చింది. తమ ముందున్న పనుల్లో ఏవి అత్యవసరమో! నిర్ణయించుకుని ప్రతి పైసాను సద్వినియోగం చేసుకునే వెసులుబాటు కూడా వచ్చింది. అయితే సంఘాల అధ్యక్షులు కూడా తమ ముందున్న సవాళ్లను అధిగమించేందుకు ఒక ప్రణాళిక సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉంది. నీటి వృథాను అరికట్టేందుకు కాల్వలకు షట్టర్ల ఏర్పాటు తక్షణావసరంగా ఉంది. కాల్వల మరమ్మతుల్లో షట్టర్లకు ప్రాధాన్యం కల్పించాల్సి ఉంది. పూడిక తీతకు కాల్వలు నోచుకోవడంలేదు. కట్టలు దెబ్బతిన్నాయి. దీంతో నీరు ఊటరూపంలో వృథా అవుతున్నది.

తీరువా వసూలు.. నిర్వహణ మరిచారు

సాగునీటి కాల్వల నిర్వహణను వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు గాలికొదిలేసింది. కాల్వల మరమ్మతులకు ఇవ్వాల్సిన నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించుకుంది. రైతులు ఏటా నీటి తిరువా చెల్లిస్తారు. సాగు నీటి సంఘాలకు వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవడంతో సంబంధిత అధికారులకే నీటి సంఘాల బాధ్యతలను అప్పగించారు. నీటి తీరువాకు సంబంధించిన నిధులను కాడా కమిటీల వారీగా కేటాయించాలి.

80 శాతం కేటాయించాలి

వసూలైన నీటి తీరువాలో 80 శాతం నిధులను నీటి సంఘాలకు కేటాయించాలి. ఈ నిధుల్లో సగం మేజర్, సగం మైనర్ ఇరిగేషన్లకు కేటాయించాలి. 10 శాతం పరిపాలనకు వినియోగిస్తారు. 15 శాతం నిధులను డిస్ట్రిబ్యూటరీ కమటీలకు, 14 శాతం నిధులను ప్రాజెక్టు కమిటీకి కేటాయించాలి. ఇలా కేటాయింపులు గత ఐదేళ్లుగా జరగలేదు. ఏటా సాగర్ ఆయకట్టు పరిధిలో నీటి తీరువా ఏటా రూ 20 నుంచి 21 కోట్లు వస్తుందని అంచనా. రైతులు చెల్లించే నీటి తీరువాపై ఈ నిధులు ఆధారపడి ఉంటాయి. ఈ నిధులు కాడాకు చేరకుండా నేరుగా ప్రభుత్వ ఖజానాకు జమ చేసుకోవడంతో కాల్వల నిర్వహణకు నిధుల కొరత ఏర్పడింది. తీరువా నిధులు మరమ్మతులకు కేటాయించి ఉంటే కాల్వలు ఇంత అధ్వానంగా ఉండేవి కాదని రైతులు చెబుతున్నారు.

పెనుగొండ 'దీపిక' తెలుగు సాహిత్యానికి కర దీపిక



పెనుగొండ లక్ష్మీనారాయణను శాలువాతో అభినందిస్తున్న సీపీఐ నేత ముప్పాళ్ల, డాక్టర్ భూసురుపల్లి

గుంటూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత, సామాజిక జీవితంలోనూ పెనుగొండ కల్తీ లేని ప్రజాస్వామ్య లౌకిక అభ్యుదయ వాది అని, ఆయన దీపిక పుస్తకం తెలుగు సాహిత్య కర దీపిక అని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ భూసురుపల్లి వెంకటేశ్వర్లు ప్రశంసించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ప్రముఖ కవి, విమర్శకుడు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అభినందన సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏళ్లకుపైగా తాను నమ్మిన 'అరసం'లో కొనసాగుతూ కార్యకర్తగా, నాయకుడిగా, రచయితగా పెనుగొండ కృషి చేస్తున్నారన్నారు. అభ్యుదయ సాహిత్య విమర్శకులైన ఆయన అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్ష పదవి చేపట్టిన తొలి తెలుగు రచయిత అని, పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కడం ఆయన ప్రతిభకు తగిన గుర్తింపు అని అభినందించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ పెనుగొండ అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికవ్వటంతోనే ఏనాడో ఖ్యాతి వచ్చిందని, నేడు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుతో ఆయన ఖ్యాతి మరింత పెరిగిందన్నారు. పెనుగొండ తన సాహిత్య ప్రస్థానంతో రెండు, మూడు తరాలను ప్రభావితం చేశారన్నారు. పెనుగొండ తన యావత్ జీవిత కాలాన్ని అరసంకి, సాహిత్య రంగానికి అంకితం చేశారంటే అతిశయోక్తి కాదన్నారు. సత్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తాను కమ్యూనిజాన్ని విశ్వసిస్తానని, తన మార్గం కమ్యూనిజమని, కమ్యూనిస్టు ఉద్యమం మరింత బలపడాలని కోరుకుంటున్నానని అన్నారు. సాహిత్యం, సాంస్కృతిక రంగంలో మార్పులు రావాల్సి ఉందన్నారు. తెలుగు నాట సాంస్కృతిక పునరుజ్జీవనానికి అరసం, విరసం వంటి సంస్థలు చేసిన కృషి ఫలితంగా బలమైన అభ్యుదయ సాహిత్య పునాదులు పడ్డాయన్నారు. వాటిని నేటితరం మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు. సాహితీ సమాఖ్య కార్యదర్శి ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా సాహిత్య రచనలు చేస్తూ మరుగునపడిన సాహిత్యాన్ని వెలుగులోకి తేవటంలో విశేష కృషి చేసిన పెనుగొండకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం అభ్యుదయ సాహిత్యానికి మరింత విలువను పెంచుతుందన్నారు. అగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ తనకు పెనుగొండకు ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని, అవగాహనకు పెనుగొండకు ఉన్న అవినాభావ సంబంధాన్ని వివరించారు. అలానే రైతు నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్, రైతు గ్రంధాల రచయిత జొన్నలగడ్డ రామారావు, ఆలోకం పెద్దబ్బాయి పెనుగొండ సాహితీ కృషిని అభినందించారు.

భారతదేశం సర్వమత సమ్మేళనం

- చినజీయర్ స్వామి



భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేస్తున్న చినజీయర్ స్వామి

మంగళగిరి సిటీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారతదేశం సర్వమత సమ్మేళనమని, ఎన్నో తరాలుగా బేదాభిప్రాయాలు లేకుండా ప్రజలంతా కలిసిమెలిసి జీవిస్తున్నారని, భవిష్యత్తులో కూడా ఇలాగే ఉండాలని త్రిదండి చినజీయర్ స్వామి ఆకాంక్షించారు. మంగళగిరి బాపూజీ విద్యాలయంలో జరుగుతున్న ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా బుధవారం చినజీయర్ స్వామి పదో పాశురాన్ని భక్తులకు వివరించారు. అనంతరం గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అష్టోత్తరం, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేసి మంగళ శాసనాలను అందించారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా యావత్ క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. విజయవాడ, నరసరావుపేట, మచిలీపట్నం ప్రాంతాల నుంచి వచ్చిన 280 మంది భక్తులు గోదాదేవికి సారెను సమర్పించారు. సాంస్కృతిక ప్రదర్శనలు, భజనలు, సంకీర్తనలు, కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి.

చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు ఏకగ్రీవానికి ప్రయత్నాలు

- బరిలో మాజీ కార్పొరేటర్ యేల్చూరి, రంగా బాలకృష్ణ
- ముగిసిన నామినేషన్‌ల ఉప సంహారణ

గుంటూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గ ఎన్నికలు రసవత్తరంగా మారుతున్నాయి. ఈ నెల 28న జరగాల్సిన ఎన్నికలను ఎలాగైనా ఏకగ్రీవం చేయాలని కొందరు నేతలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. తూర్పు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత చాంబర్ ఎన్నికలను ఏకగ్రీవం చేసేందుకు రంగంలోకి దిగారు. చర్చలు నడుపుతున్నట్లు సమాచారం. ప్రతి ఏటా జరిగే చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గ ఎన్నికలు ఈ దఫా మరింత రసవత్తరంగా మారాయి. చాంబర్ అధ్యక్షుడుగా సుదీర్ఘకాలంగా వ్యవహరిస్తున్న ఆతుకూరి ఆంజనేయులకు పోటీగా చాంబర్ కార్యదర్శిగా సుదీర్ఘకాలంగా కొనసాగిన రంగా బాలకృష్ణ గత ఏడాది ఎన్నికల బరిలో నిలిచి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చవి చూశారు. ఈ దఫా ఎలాగైనా చాంబర్ అధ్యక్ష పీఠాన్ని కైవసం చేసుకోవాలన్న లక్ష్యంతో రంగా బాలకృష్ణ ముందు నుంచే వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. చాంబర్‌కు సంబంధించిన పలువురు పెద్దలను కలవటమే కాక సభ్యులతో ఆత్మీయ సమావేశాలు పెడుతూ మద్దతు కూడగడుతున్నారు. కాగా చాంబర్ అధ్యక్ష పదవి పోటీ నుంచి ఈ దఫా వైదొలిగిన ఆతుకూరి ఆంజనేయులు స్థానంలో మాజీ కార్పొరేటర్ యేల్చూరి వెంకటేశ్వర్లు బరిలో నిలిచారు. యేల్చూరి వెంకటేశ్వర్లు, రంగా బాలకృష్ణ ఇద్దరూ పోటీ పోటాగా అధ్యక్ష పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి వ్యాపార వర్గాలతో యేల్చూరి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో ఈ నెల 23న నామినేషన్‌ల ఉపసంహారణ గడువు కూడా పూర్తయింది. ఈ నెల 26న తుది జాబితాను సిద్ధం చేయనున్నారు. నామినేషన్‌లను ఉప సంహరించుకోకపోవటంతో ఎన్నికలు తప్పవని చాంబర్ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈనెల 26న తుది జాబితా ప్రకటన వరకు సమయం ఉంటుందనీ, అప్పటి లోగా ఏకగ్రీవానికి ప్రయత్నాలు జరుగుతాయని చెబుతున్నారు. మొత్తానికి చాంబర్ ఎన్నికలు ఈ దఫా రసవత్తరంగా మారాయి. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా 28న చాంబర్ ఎన్నికలు తప్పదన్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

యువతి కిడ్నాప్‌కు యత్నం

- ఆటోలో నుంచి దూకి పరిగెత్తిన మహిళ

పొన్నూరుటౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నుంచి తెనాలి వెళ్తున్న యువతిని ఆటోలో ఎక్కించుకున్న యువకులు కిడ్నాప్ చేయటానికి చేసిన ప్రయత్నం విఫలమైంది. కిడ్నాప్‌కు యత్నించిన యువకుల కోసం చేబ్రోలు పోలీసులు సినీ పక్కీలో ఐదు కిలోమీటర్ల మేర పంటపొలాల్లో డొంకల్లో ఛేజ్ చేసి ఆటోను స్వాధీనం చేసుకున్న సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. చేబ్రోలు ఎస్సై వెంకటకృష్ణ కథనం ప్రకారం తెనాలికి చెందిన 25 ఏళ్ల యువతి గుంటూరులో ప్రైవేటు సంస్థలో పని చేస్తుంది. మంగళవారం విధులు ముగించుకొని బుడంపాడు బైపాస్ వద్ద బస్సు కోసం ఎదురు చూస్తుండగా ఏపీ39యూఆర్ 7221 నంబరు కలిగిన ఆటో వచ్చింది. తెనాలి వెళ్తున్నామని చెప్పి యువతిని ఆటో ఎక్కించుకున్నారు. బుడంపాడు, నారాకోడూరు గ్రామాల మధ్య పంట పొలాల్లోకి ఆటోను మళ్లించారు. మద్యం మత్తులో ఉన్న యువకుల నుంచి తప్పించుకోవడానికి యువతి ఆటోలో నుంచి దూకి మెయిన్ రోడుపైకి పరుగులు తీసింది. ఆటోలో నుంచి దూకటంతో యువతికి గాయాలయ్యాయి. యువతి కేకలు వేస్తూ పరుగులు పెడుతుండగా రహదారిపై వెళ్తున్న వారు ఆమెను ఆపి జరిగిన సంఘటనను తెలుసుకొని 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అదే సమయంలో నారాకోడూరులో విధులు నిర్వహిస్తున్న ఎస్సై వెంకట కృష్ణ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని యువతి చెప్పిన ఆనవాళ్ల మేరకు ఆటో వెళ్లిన డొంక రోడ్డులోకి వెళ్లారు. పోలీసుల రాకను గుర్తించిన యువకులు ఆటోతో పారిపోయే ప్రయత్నం చేశారు. అదే సమయంలో వర్షం కురుస్తుండటంతో పోలీసులు సినీపక్కీలో ఆటోను, యువకులను పట్టుకునేందుకు పరుగులు తీశారు. పంట పొలాల నుంచి డొంక రోడ్లలో ఈ ఛేజ్ సాగింది. ఐదు కిలోమీటర్ల మేర వెంబడించిన పోలీసులు హెచ్చరికలు జారీ చేయగా యువకులు ఆటోను వదిలి పరారయ్యారు. ఆటోలో యువతికి సంబంధించిన సెల్‌ఫోన్, పర్సు లభ్యమైనట్లు సమాచారం. ఆటో నంబరు ఆధారంగా యువకులు చేబ్రోలు, నారాకోడూరు గ్రామాలకు చెందిన వారుగా పోలీసులు అనుమానిస్తున్నారు.యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం దోపిడీపై ఫిర్యాదు

ఈపూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలిపై దాడి చేసి చనిపోయిందని భావించి ఆమె మెడలోని మూడు సవర్ల బంగారు నానుతాడును దొంగిలించాడు. కాని వృద్ధురాలికి స్పృహ వచ్చి కొడుకు, మనవడికి జరిగిన విషయం చెప్పింది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. ఇంట్లో టీవీ పనిచేయక పోవడంతో గ్రామంలోని కేబుల్ ఆపరేటర్‌ను కలిసి విషయం చెప్పింది. టీవీ బాగు చేసేందుకు మంగళవారం సాయంత్రం వచ్చిన ఆపరేటర్‌కు వృద్ధురాలు గుంటకుల పేరమ్మ మెడలోని బంగారంపై కన్నుపడింది. దీంతో వృద్ధురాలిపై దాడి చేసి ఆమె చనిపోయిందని భావించి మెడలోని బంగారు నానుతాడును తీసుకోని వెళ్లిపోయాడు. స్పృహలోకి వచ్చిన పేరమ్మ జరిగిన విషయాన్ని కొడుకు, మనువడుకు చెప్పింది. వారు కేబుల్ ఆపరేటర్‌ను పిలిచి అడగగా తనకు తెలియదని బుకాయించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు

రైలు నుంచి జారి కృష్ణాజిల్లా వాసి మృతి

తెనాలి క్రైమ్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ బుధవారం తెలిపారు. తెనాలి ఆర్‌పీఎఫ్ ఎస్ఐ మల్యాద్రి తెలిపిన వివరాల మేరకు.. తెనాలి - రేపల్లె రైలు మార్గంలోని వేమూరు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని మృతదేహం రైల్వే ట్రాక్ వద్ద పడి ఉందన్న సమాచారంతో వెళ్లి పరిశీలించారు. మృతదేహం వద్ద లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా మృతుడు కృష్ణా జిల్లా ఎదురుమొండి గ్రామానికి చెందిన కొల్లూరు రఘురాంబాబు (27)గా గుర్తించారు. రేపల్లె వైపు వెళ్లే ట్రైన్ నుంచి జారి పడి మృతి చెందగా దీనిపై కేసు నమోదు చేసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు ఎస్ఐ తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 575.20 అడుగులు ఉంది. ఇది 269.62 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8793 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8280, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 16716, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్‌ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 36,489 విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	107.115.126
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



పిడుగురాళ్ల లూథరన్ చర్చిలో క్రిస్మస్ ప్రార్థనలకు హాజరైన మహిళలు

పిడుగురాళ్ల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని పట్టణ, గ్రామాల్లోని చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించారు. బుధవారం పట్టణంలోని తెలుగు బాప్టిస్టు చర్చి, లూథరన్ చర్చిలో ప్రార్థనలకు ఆయా ప్రాంతాలకు చెందిన వారు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. బ్రాహ్మణ పల్లి, జానపాడు, గుత్తికొండ, తుమ్మలచెరువు, కరాలపాడు, కామేపల్లి, కోనంకి గ్రామాలతో పాటు అనేక ప్రాంతాల్లోని చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చర్చిల పాస్టర్లు మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన మార్గంలో అందరూ నడుచుకోవాలని, శాంతి, ప్రేమ, కరుణ, దయతో ప్రతిఒక్కరు కలసిమెలసి ఉండాలని సూచించారు.

● **దాచేపల్లి** : దాచేపల్లిలోని లూథరన్ చర్చి, బాప్టిస్టు చర్చిలలో రాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు బోధించిన ప్రేమ, దయ, కరుణ ప్రతిఒక్కరు కలిగివుండాలని తెలిపారు. కేశానుపల్లి, దాచేపల్లి, పెద గార్లపాడు, నారాయణపురం, ఇరికేపల్లి తదితర గ్రామాల్లోని చర్చిలను విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.

● **మాచవరం** : మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచే ఆయా గ్రామాల చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మోర్జంపాడు, మాచవరం, భీమవరం చర్చిల్లో జీవిత ప్రకాష్, మాచవరం లూథరన్ దేవాలయంలో ఫాదర్ ప్రభాకర్, జీసెస్ గ్రాస్పెల్ చర్చిలో ఫాస్టర్ పేరం సుందరరావు, పిన్నెల్లి చర్చిలో ఫాస్టర్ గురుప్రసాదు ఏసు క్రీస్తు జీవిత చరిత్ర గురించి భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల చర్చిలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. మాచవరంలోని షేర్ అండ్ కేర్ దివ్యాంగుల ఆశ్రమంలో వృద్ధులకు, వితంతువులకు ఆశ్రమ నిర్వాహకులు అజయ్‌బాబు ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ కార్యక్రమం జరిగింది.

భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు



సెంటినరీ తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చిలో క్రిస్మస్ కేకును కట్ చేస్తున్న భక్తులు

సత్తెనపల్లి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు పుట్టిన రోజు సంబరాలను బుధవారం క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు జననం గురించి ఆయా చర్చిల ఫాస్టర్లు వివరించారు. భక్తి గీతాలను ఆలపించారు. క్రిస్మస్ కేక్‌లను కట్ చేసి పంపిణీ చేశారు. ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ తెలుగు చర్చి, లూథరన్ చర్చి, ఆర్‌సీఎం, బాప్టిస్ట్ చర్చి ఇంకా పలు చర్చిల కమిటీల నిర్వాహకుల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి పాల్గొని కేక్‌ను కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి జ్ఞానరాజ్‌పాల్, వేదాద్రి, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

● **రాజుపాలెం** : మండలంలోని అన్ని గ్రామాల్లో చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా పలు గ్రామాల్లోని పాస్టర్లకు దుస్తులు అందజేయటంతో పాటు కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ముఖ్యంగా రాజుపాలెంలో ఉన్న ఇందిరా జయంతి కాలనీలో ఉన్న చర్చిలో క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించారు. చర్చిని విద్యుదీపాలకరణతో ముస్తాబు చేశారు.

● **ముప్పాళ్ళ** క్రిస్మస్ వేడుకలను మండలంలోని క్రైస్తవులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జామునే చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాస్టర్లు క్రీస్తు పుట్టుక సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో చర్చిల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముప్పాళ్ళ, మాదల, తురకపాలెం తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కోలాహలంగా మధుబాబు జన్మదిన వేడుకలు



జన్మదిన వేడుకల్లో మధుబాబు

మాచర్లటౌన్, డిసెంబరు25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబు తన జన్మదిన వేడుకలను బుధవారం హైదరాబాద్‌లోని తన స్వగృహంలో కోలాహలంగా నిర్వహించారు. కుటుంబసభ్యులు, టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానుల మధ్య జన్మదిన కేక్ కట్ చేశారు. మధుబాబు, ఆయన కుటుంబసభ్యులను పార్టీ నేతలు పూలమాలలతో సన్మానించారు. మధుబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

21 ఏళ్ల తరువాత రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు

రెంటచింతల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): 21 సంవత్సరాల తరువాత రెంటచింతలలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో ఎడ్లపోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు. జనవరి 28 నుంచి 5 రోజుల పాటు 5 రకాల సైజుల్లో ఈ పోటీల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఫిబ్రవరి 2న కానుకమాత తిరునాళ్ల.. అదే సమయంలో చర్చి నిర్మించి 175 ఏళ్లు కావడంతో పాటు రూ.5 కోట్లతో చేపట్టిన చర్చి పునర్నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఎలాంటి ఆటంకాలు లేకుండా జరుగుతున్న ఎడ్ల పోటీలను 2004 జనవరి 29న అర్థాంతరంగా నిలిపి వేశారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఎడ్ల జతల యజమానులు ఉసురోమంటూ ఎడ్లను తోలుకుని వెను తిరిగారు. మళ్లీ ఇప్పుడు నేతలు పూనుకోవడంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతుంది.

ఘనంగా ధనుర్మాసోత్సవాలు



ప్రత్యేక అలంకారంలో లక్ష్మీ నరసింహ స్వామి మూలవిరాట్



వేణుగోపాల స్వామి వారి ప్రత్యేక అలంకారం

క్రోసూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రోసూరులోని పలు వైష్ణవాలయాల్లో ధనుర్మాసోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుగుతున్నాయి. క్రోసూరులోని వేణు గోపాల స్వామి దేవాలయం, కొండ మీద కుందపాద నరసింహా స్వామి దేవాల యం, పిడుగురాళ్ళ బస్టాండ్ సెంటర్లోని రాజ్యలక్ష్మి సమేత నరసింహ స్వామి దేవాలయా ల్లో తెల్లవారుజాము నుంచే తిరుప్పావై వేడుకలు నిర్వహిస్తున్నారు. విష్ణు సహస్ర నామార్చనలు, కుంకుమార్చనలతో దేవాలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. వేణుగోపాల స్వామి ఆలయంలో రుక్మిణీ సత్యభామ సమేత స్వామి వారిని, నరసింహ స్వామి దేవాలయంలో రాజ్యలక్ష్మి సమేత సామి వార్ల మూలవిరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతవరంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

ఏసుక్రీస్తు సందేశం మానవాళికి ఆదర్శం

● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

● పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు సందేశం మానవాళికి ఆదర్శమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. వెల్దుర్తిలోని లూథరన్ ప్రార్థనా మందిరంలో బుధవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. భక్తులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రార్థనా మందిరానికి వచ్చిన బ్రహ్మానందరెడ్డికి సంఘ పెద్దలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● మాచర్ల పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీలో మాజీ కౌన్సిలర్ కొందూరు లెనిన్‌బాబు బుధవారం క్రిస్మస్ వేడుకలు జరిపారు. ఈ వేడుకల్లో టీడీపీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. లెనిన్‌బాబుకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత యెనుముల కేశవరెడ్డి, నర్రా గురవారెడ్డి, గోగుల సీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **దుర్గి** : మండల పరిధిలో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముటుకూరులోని ఏఈఎల్‌సీ చర్చిలో కటికల ఏసుదానం భక్తులకు దైవ సందేశం అందించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. కేక్‌ను కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుక్కమూడి ప్రసాద్, డిలిగేట్ మాచర్ల చిన పేరయ్య, సామేలు, అన్నారావు, ఏలియా, మాచర్ల శోభన్‌బాబు, మరియమ్మ, యోహాను, లాజరు, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

● **గురజాలటౌన్** : మండలపరిధిలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తెలుగు బాప్టిస్టు చర్చిలో మంగళవారం రాత్రి నుంచే ప్రార్థనలు జరిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

● **రెంటచింతల** : ఏసుక్రీస్తు ప్రేమను ఆచరణలో చూపడమే నిజమైన క్రిస్మస్ అని, సమస్త ప్రాణులతో స్నేహభావం కలిగి ఉండాలని ఫాదర్ తుమ్మా వేళాంగిణి అన్నారు. మంగళవారం అర్ధరాత్రి, బుధవా రం ఉదయం ఆర్‌సీఎం చర్చిలో వేలాది మంది భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. సహాయ విచారణ గురువు అగస్టీస్, సాగరమాత, విజడమ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ ఎలీషారాజ్, పాస్టర్ దేవా నందం లు పాల్గొన్నారు. అనంతరం దివ్యసప్రసాదాన్ని భక్తులకు చూపించారు.

మాచర్ల రూరల్ : మండలంలోని విజయపురిసౌత్‌లో గల సాగర మాత ఆలయంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిపారు. ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యాన కేక్ కట్ చేశారు. అనంతరం దివ్యబలిపూజా కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు దైవ సందేశం అందించారు. ఈ వేడుకల్లో ఫాస్టర్ జోసఫ్ తంబి, డీకెన్ బాల, భక్తులు పాల్గొన్నారు.

● **కారంపూడి**: మండలపరిధిలో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని లూథరన్ చర్చిలో శాంతాక్లాజ్ వేషధారణలో చిన్నారులు సందడి చేశారు. భక్తులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షల తెలిపారు.



ముటుకూరు ఏఈఎల్‌సీ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న భక్తులు

క్రైస్తవులు శాంతి, సమాధానంతో మెలగాలి

● గుంటూరు జిల్లా బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య

● ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రవీణ్



తాళ్లచెరువు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ను ఆశీర్వదిస్తున్న బిషప్ భాగ్యయ్య

అచ్చంపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : క్రైస్తవులు ఇతరులకు ఆదర్శంగా జీవిస్తూ శాంతి సమాధానంతో మెలగాలని గుంటూరు జిల్లా బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. బుధవారం మండలంలోని తాళ్ళచెరువు గ్రామంలో క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దివ్య బలిపూజలో స్థానిక విచారణ గురువు పుట్టి అంతోనిరాజు, రేపూడి రాయప్ప, పీటర్ పాపయ్య మరింత మంది గురువులు, కన్యాస్త్రీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు జూబ్లీ విజయోత్సవ పతాక స్థూపం శంకుస్థాపన చేశారు. రూ.5 లక్షలు విలువైన ఈ స్థూపానికి దొండేటి చిన్నపరెడ్డి, శౌరీ లు దంపతులు విరాళం అందించారు. సాయంత్రం కొవ్వొత్తుల ప్రద ర్శన తేరు ఊరేగింపు నిర్వహించారు.

ఎమ్మెల్యేభాష్యం ప్రవీణ్ ప్రత్యేక పూజలు

మండలంలోని తాళ్ళచెరువు గ్రామంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో బుధవారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు దైవసందేశాన్ని అందించారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే సతీమణి లావణ్య ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వారిని బిషప్ భాగ్యయ్య ఆశీర్వదించారు. అనంతరం గ్రామంలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తాడువాయిలోని ప్రార్థనా మందిరంలో జరిగిన ప్రత్యేక పూజల్లో వందలాది మంది పాల్గొన్నారు.

● **క్రోసూరు**: మండలంలో క్రిస్మస్ వేడు కలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. క్రోసూరులోని ఆంధ్రా లూథరన్ చర్చి ఆధ్వర్యంలో అర్ధరాత్రి క్రీస్తు పుట్టుకను స్వాగతిస్తూ వీధుల్లో కొవ్వొత్తులతో భక్తులు పెద్దసంఖ్యలో ప్రదర్శనలో పాల్గొన్నా రు. చర్చి ఫాస్టర్ సుందరరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీస్తు బోధనలైన ప్రేమ, దయ, కరుణ, క్షమాగుణం, శాంతి మానవాళికి మార్గదర్శకం అన్నారు. చర్చిలో జరిగిన ప్రార్థనల్లో వేలాది మంది భక్తులు హాజరయ్యారు. మండలంలోని బయ్యవరం హోసన్న ప్రార్థ నా మందిరం, క్రోసూరులోని బేతనీయ ప్రార్థనా మందిరం, పలు గ్రామాల్లో ఉన్న చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

● **పెదకూరపాడు**: మండలంలోని పలు క్రైస్తవ దేవాలయాల్లో క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు జననం క్రిస్మస్ పండుగను ఉద్దేశించి ఫాస్టర్ నరేష్‌కుమార్, పాస్టర్ విజయ్‌చందర్‌లు వివరించారు. బలుసుపాడులో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు ఘంటా పాపయ్య కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గంజి విజయబాబు తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రా యువాంజికల్ లూథరన్, ఆర్‌సీఎం చర్చి, బైబిల్ మిషన్, హోసన్న, ఫెలోషిప్ ప్రార్థనా మందిరాల్లో క్రీస్తు సందేశాన్ని వివరించారు.

కాలువలపై జంగిల్.. పూడిక తొలగింపు



బృగుబండ మైనర్ కాలువపై జంగిల్, పూడికతీత పనులు చేస్తున్న దృశ్యం

రాజుపాలెం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): సాగునీటి కాలువల ఆధునికీకరణకు కూటమి ప్రభుత్వం చొరవ చూపుతుంది. కాలువలకు ఇరువైపుల జంగిల్ పెరటం, అడుగుభాగంలో పూడిక ఎక్కువగా ఉండి నీటి పారుదలకు ఇబ్బంది కలుగుతుంది. ఈ విషయాన్ని ఇటీవల కాలంలో జరిగిన సాగునీటి సంఘ ఎన్నికల్లో బెల్లంకొండ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన రాజుపాలెంకు చెందిన చొక్కా శ్రీనివాసరావు స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. కన్నా స్పందించి ప్రస్తుతం పనులు చేయించమని చెప్పటంతో బుధవారం మొక్కపాడు, బృగుబండ, కందులవారిపాలెం గ్రామాలకు చెందిన రైతులకు ఇబ్బంది లేకుండా బృగుబండ మైనర్ కాలువపై జంగిల్, పూడితీత పనులు చేయించారు. ఈ పనులను బృగుబండ డబ్ల్యూ టీసీలు తోట శ్రీనివాసరావు, పులిబండ్ల హనుమంతురావు, మాగంటి సాంబయ్య, నానాబాల రామయ్య, బీ సీతారామిరెడ్డి, పీ రామారావు, గోళ్ల వెంకట్రావు, పత్తి యాగయ్య(జనసేన), మొక్కపాడు గ్రామ సర్పంచ్ కణదం శ్రీనివసరావు, ఎన్ఎస్‌పీ ఏఈ ఇబ్రహీం పర్యవేక్షించారు.

అమరావతి మేజరు పరిధిలోని

క్యూమైనర్ వద్ద నాచు గుర్రపు డెక్క తొలగింపు



అమరావతి మేజరు పరిధిలోని క్యూమైనర్ రెగ్యులేటర్‌కు అడ్డుపడిన నాచు గుర్రపు డెక్కను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

పెదకూరపాడు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అమరావతి మేజరు పరిధిలోని క్యూ మైనర్ రెగ్యులేటర్ వద్ద నాచు గర్రపుడెక్క అడ్డు పడి నీరు నిల్వ ఉండి నీరు ముందుకు నడిచే పరిస్థితి లేకుండా పోయింది. ఈ విషయాన్ని తెలుసుకున్న పెదకూరపాడు డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ వడ్లమూడి అప్పారావు జేసీబీ ద్వారా రెగ్యులేటర్‌కు అడ్డుగా ఉన్న నాచు, గుర్రపు డెక్కను తొలగించారు. ఆయన వెంట ఎన్ఎస్ కెనాల్స్ ఏఈ చిరంజీవిరెడ్డి తదితరులున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి కరెంటు సమస్య తొలగింది

దాచేపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీలో లక్షల రూపాయల నిధులతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌కు విద్యుత్‌శాఖ అధికారులు కరెంటు మీటర్లను అమర్చారు. లక్షలు వెచ్చించి ఆసుపత్రి భవనం నిర్మించినప్పటికీ విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో వైద్యసేవలు అరకొరగా స్థానికులకు అందుతున్నాయి. దీంతో స్థానిక మహిళలు నగర పంచాయతీ కార్యాలయం వద్ద కొద్దిరోజుల క్రితం నిరసన వ్యక్తం చేశారు. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు, నగర పంచాయతీ అధికారులు సమన్వయం చేసుకొని విద్యుత్‌శాఖకు చెల్లించాల్సిన లక్షా 23 వేల రూపాయల బకాయిలను నగర పంచాయతీ అధికారులు విద్యుత్‌శాఖకు చెల్లించారు. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు కరెంటు మీటర్ ఏర్పాటు చేయడంతో ఆస్పత్రిలో విద్యుత్ సరఫరా జరిగింది. స్థానిక మహిళలు ఆయాశాఖ అధికారులకు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు ధన్యవాదాలు తెలియజేశారు.

అమరావతి ఎస్‌హెచ్‌వో బదిలీ

అమరావతి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): అమరావతి పీఎస్‌లో ఎస్‌హెచ్ వోగా విధులు నిర్వహిస్తున్న ఎం శ్రీనివాసరావును బదిలీ చేస్తూ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. బుధ వారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. రెండు రోజుల క్రితం ఎస్‌ఐగా బాధ్యతలు తీసుకున్న కే అమీర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆరు నెలల క్రితం ఎస్‌హెచ్‌వోగా జాయిన్ అయిన శ్రీనివాసరావును బదిలీ చేయడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

ఇరువర్గాల మధ్య ఘర్షణ.. ఒకరికి గాయాలు

ముప్పాళ్ళ డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ముప్పాళ్ళ మద్యం దుకాణం వద్ద ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే బుధవారం సాయంత్రం మద్యం దుకాణం వద్ద మద్యం కొనుగోలు చేసేందుకు వెళ్ళిన ముప్పాళ్ళకు చెందిన కటుకూరి శేషుకు, ములకలూరుకు చెందిన వారికి మధ్య గొడవ జరిగింది. ఈ సంఘటనలో బీరు బాటిల్ తీసుకొని శేషు తలపై కొట్టడంతో శేషు తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న ముప్పాళ్ల పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. తీవ్ర గాయాలైన శేషును సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. శేషు తలకు ఆరు కుట్లు పడినట్టు సమాచారం.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం



సీపీఐ జెండాలను ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

అమరావతి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవం సందర్భంగా బుధవారం అమరావతిలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సెంటర్లో సీపీఐ జెండాలను ఆవిష్కరించి నాయకులు ప్రసంగించారు. పేదబడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి సీపీఐ కృషి చేస్తుందని, భారత స్వాతంత్ర్య పోరాటంలో సీపీఐ చేసిన పోరాటం మరువలేనిదని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ వాతావరణం కల్పిస్తున్నాం

● ఎస్‌ఐ సుధీర్‌కుమార్

ఫటాఫట్



దుర్గి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పలు సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలతో స్నేహ పూర్వకంగా మెలుగుతూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎస్‌ఐ సుధీర్‌కుమార్ తెలిపారు.

ప్ర: సారా తయారీని అరికట్టడానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: మండలపరిధిలో సారా తయారీని అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాం. సారా తయారీ, విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందితే దాడులు నిర్వహిస్తున్నాం. సారా వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రజలకు వివరిస్తూ చైతన్యవంతులను చేస్తున్నాం.

ప్ర: గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జ: మండలపరిధిలోని గ్రామాలను నిత్యం పర్యవేక్షిస్తున్నాం. గ్రామస్థులతో సమావేశాలు నిర్వహిస్తున్నాం. చిన్న చిన్న విషయాలకే గొడవల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచిస్తున్నాం. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాం.

ప్ర: దొంగతనాలు నిరోధించేందుకు మీ కృషి ఏమిటి?

జ: మండలపరిధిలో రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. అనుమానిత వ్యక్తులు కనపడితే తమకు సమాచారం అందించాలని గ్రామస్థులకు సూచిస్తున్నాం. వివిధ పనులపై బయటి ఊర్లకు వెళ్లే వారు ముందుగా తమకు సమాచారం అందిస్తే వారి గృహాలకు రక్షణ కల్పిస్తామని వివరిస్తున్నాం.

ప్ర: మండల ప్రజలకు మీరిచ్చే సూచనలేమిటి?

జ: ప్రజలు వివాదాల జోలికి వెళ్లకుండా ప్రశాంత వాతావరణంలో జీవించాలి. అందరూ ఐక్యంగా ఉంటూ సోదరభావంతో మెలగాలి. ఏదైనా సమస్య లుంటే మా దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తాం.

చిరు జల్లులతో రైతుల్లో ఆందోళన

● కల్లాల్లోని ధాన్యం, మిర్చిపై పట్టలు కప్పుతున్న రైతులు



వేమవరంలో మిర్చి కల్లాలపై పట్టలు కప్పిన దృశ్యం

మాచవరం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న చిరు జల్లులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికొచ్చిన తరుణంలో చిరు జల్లులతో పాడై పోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో వరి కోతలు జరుగుతున్నాయి. మరికొన్ని గ్రామాల్లో మిర్చి కోసి కల్లాల్లో ఆరబెట్టుకున్నారు. కురుస్తున్న చిరుజల్లుల వల్ల మిర్చి పంట నీరు పోసుకొని తెల్ల కాయలుగా మారిపోతాయని, రేటు గిట్టుబాటు కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలకు వేలు పెట్టుబడులు పెట్టి పంట చివరి దశలో ఉన్న సమయంలో అకాల వర్షాలతో నష్టపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొనసాగుతున్న అల్పపీడనం

పిడుగురాళ్ల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా అల్పపీడన ప్రభావంతో పల్నాడు ప్రాంతంలో చిరుజల్లులు పడుతున్నాయి. దాచేపల్లిలో ఆరబోసిన ధాన్యం రాసులపై పట్టలు కప్పుకునేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు. ఇదే పరిస్థితి మరో రెండు రోజులు కొనసాగితే ధాన్యంలో తేమ శాతం పెరిగి నాణ్యత తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తల్లడిల్లిపోతున్న మిర్చి రైతులు

దాచేపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణితో కురుస్తున్న వర్షాలతో మిర్చి రైతులు తల్లడిల్లిపోతున్నారు. బుధవారం వేకువ జాము నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో మిర్చి తెల్లకాయలుగా రంగు మారి, మచ్చలు ఏర్పడటంతో ధర తగ్గే అవకాశం ఉంది. కొద్ది రోజుల క్రితం పంట కాల్వల ద్వారా మిర్చి పొలాలకు సాగునీరు అందించిన రైతులకు వర్షం కారణంగా మరింత నష్టపోయే ప్రమాదం ఉంది. ప్రకృతి వైపరీత్యాలతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు.

● **అమరావతి** : బుధవారం సాయంత్రం కురుస్తున్న బారీ వర్షంతో కంది, మినుము, పత్తి, వరి సాగుచేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలో కొంతమేర మినుము, వరి, పత్తి పంటలు ఇంటికి చేరినప్పటికి కొందరి పంటలు పొలంలోనే ఉండటంతో వర్ష ప్రభావంతో దెబ్బతినే అవకాశం ఉంది. కంది కూడా పూత దశలో ఉండటంతో వర్షానికి పూత రాలిపోయే ప్రమాదం ఉన్నందున రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు రాత్రి భత్యం మంజూరు

● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

● హర్షం వ్యక్తం చేసిన ఉద్యోగులు

సత్తెనపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో రాత్రి వేళ ల్లో విధులు నిర్వహించే ఉద్యోగులకు రాత్రి భత్యం మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటంపై సత్తెనపల్లి ఆర్టీసీ డిపోలోని కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం రాత్రి భత్యాన్ని ఆపి వేసి అన్యాయం చేసిందని, కూటమి ప్రభుత్వం కొలువు దీరిన ఆరు నెలల్లోనే రాత్రి భత్యాన్ని ఇచ్చేందుకు ముందుకు రావటంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాత్రి భత్యం రద్దు చేయటంతో ఆర్టీసీ సంఘాలు ఆందోళన చేపట్టినప్పటికీ వైసీపీ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాత్రి భత్యం ఇవ్వాలని వివిధ సంఘాల నుంచి వినతులు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో రాత్రి భత్యం మంజూరు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటంతో ఆర్టీసీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సత్తెనపల్లి ఆర్టీసీ డిపోలో రాత్రి వేళల్లో విధులు నిర్వహించే డ్రైవర్లు 20 మంది వరకు ఉంటారు. వీరికి నిబంధనల ప్రకారం నెలవారి జీతంతో పాటు రాత్రి విధులకు వెళ్లిన రోజున అదనంగా భత్యం రూ.150 నుంచి రూ.400 వరకు చెల్లిస్తారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

రాష్ట్ర స్థాయి క్యారమ్స్ పోటీల్లో హిమశ్రీకి రజితం



నాదెండ్ల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుమామిళ్ల నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని సత్తెనపల్లి హిమశ్రీ రాష్ట్ర స్థాయి క్యారమ్స్ పోటీల్లో రజిత పతకాన్ని సాధించింది. అండర్-14 విభాగంలో ప్రకాశం జిల్లా పాకాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు జరిగాయి. గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి, హెచ్ఎం, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

చిలకలూరిపేటలో ఫుడ్ స్ట్రీట్ ఏర్పాటు చేస్తాం: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): త్వరలో పట్టణ ప్రజల కోసం ఫుడ్ స్ట్రీట్ అందుబాటులోకి తీసురానున్నట్టు ఎమ్మెల్యే ప్రత్తిపాటి బుధవారం తెలిపారు. హైదరాబాద్, విజయవాడ నగరాల మాదిరిగా ఫుడ్ స్ట్రీట్ సిద్ధం చేస్తామని చెప్పారు. ఇందుకు అవసరమైన స్థలాన్ని తక్షణం ఎంపిక చేయాలని మున్సిపల్, పోలీసు శాఖల అధికారులను ఆయన ఆదేశించారు. ఫుడ్ స్ట్రీట్‌లో స్టాల్స్ ఏర్పాటుచేసి నిర్వాహకులు రుచికరమైన, నాణ్యతమైన ఆహారాన్ని అందించాలని కోరారు.

కళామందిర్ సెంటర్లో బస్ షెల్టర్ ప్రారంభం

చిలకలూరిపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం పట్టణంలోని కళామందిర్ సెంటర్లో బస్ షెల్టర్‌ను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం ప్రారంభించారు. మున్సిపాలిటీ స్థలంలో స్థానిక టీడీపీ సీనియర్ నాయకులు గోవతోటి అన్నారావు, వింజనంపాడుకు చెందిన మహేశ్‌లు నిర్మాణం చేపట్టి, ప్రయాణికులు కూర్చోవడానికి అవసరమైన బెంచీలు, తాగునీరు ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నానన్నారు. ప్రయాణికులు బస్ షెల్టర్‌ను సద్వినియోగం చేసుకోవాలని, పరిశుభ్రంగా ఉంచి వినియోగించుకోవాలని కోరారు.

డీసీ చైర్మన్‌కు ఉపాధ్యాయ సంఘ నాయకుల అభినందనలు

వినుకొండ టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నూజెండ్ల మండల త్రిపురాపురం డీసీగా నూతనంగా ఎంపికైన గంగినేని రాఘవును యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు బుధవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గంగినేని ఫౌండేషన్ ద్వారా ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు.



స్కూబా డైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న కేడెట్స్

ఎన్‌సీసీ విద్యార్థుల స్కూబా డైవింగ్ శిక్షణ పూర్తి

నరసరావుపేట కల్చరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి). మండలంలోని నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూబా డైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైజాగ్ నావల్ కమాండ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 17నుంచి 24వరకు జరిగిన స్కూబా డైవింగ్ క్యాంప్‌నకు గుంటూరు ఎన్‌సీసీ గ్రూపు తరపున నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలల నుంచి సీనియర్ కాడెట్లు సార్జెంట్ డి.అప్పలనాయుడు, సీపీఎల్ సీహెచ్.మణికుమార్‌లు ఎంపికై శిక్షణ శిబిరంలో పాల్గొన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, వైస్‌చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, సెక్రటరీ మిట్టపల్లి రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వర్లు, కళాశాల ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్‌బాబు అభినందించారు.



రెడ్డిపాలెం మద్యం షాపులో చోరీకి యత్నం



చోరీకి యత్నించిన వ్యక్తి

రొంపిచర్ల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెంలోని మద్యం దుకాణంలో దొంగలు బుధవారం రాత్రి చోరీకి యత్నించారు. షాపునకు ఉన్న తాళాలను పగల గొట్టేందుకు ప్రయత్నించారు. అందులో ఒక తాళం పగిలిపోయింది. రెండో తాళం పగలకపోవటంతో అక్కడి నుంచి వెనుదిరిగి వెళ్లారు. ఉదయం షాపు తీసేందుకు వచ్చిన వారు గమనించి ఫిర్యాదు చేశారు. సీసీ టీవీలో దొంగతనం యత్నం నమోదైంది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిర్వాహకుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న అల్పపీడన వర్షం

పిడుగురాళ్ల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా అల్పపీడన ప్రభావంతో పల్నాడు ప్రాంతంలో చిరుజల్లులతో కురుస్తున్న వర్షం బుధవారం కూడా ఎడతెరపి లేకుండా కురిసింది. దాచేపల్లి ప్రాంతంలో ఆరబోసిన ధాన్యం రాసులపై పట్టలు కప్పుకునేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు. ఇదే పరిస్థితి మరో రెండు రోజులు కొనసాగితే ధాన్యంలో తేమశాతం పెరిగి నాణ్యత తగ్గే ప్రమాదం వుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భక్తి శ్రద్ధలతో క్రిస్మస్ ప్రార్థనలు

- కిట కిటలాడిన చర్చిలు
- పలుచోట్ల సేవా కార్యక్రమాలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, పాస్టర్ క్రిస్టఫర్



తిమ్మాపురం లూథరన్ క్రీస్తు దేవాలయంలో ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు

నరసరావుపేట, డిసెంబరు 25: క్రిస్మస్ పండుగను క్రైస్తవులు అత్యంత భక్తి శ్రద్ధలతో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. క్రిస్మస్ పార్థనలలో అధిక సంఖ్యలో క్రైస్తవులు హాజరయ్యారు. నరసరావుపేటలోని టౌన్ బాప్టిస్టు చర్చిలో ఫాస్టర్ మున్నంగి ఏలిషా, డాక్టర్ ఎలికే మృత్యుంజయ దైవ సందేశాన్ని అందించారు. సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి, ప్రకాష్ నగర్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ జేవీఆర్ చర్చిలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి 12 గంటలకు క్రిస్మస్ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సెయింట్ ఫ్రాన్సిస్ చర్చిలో ఫాదర్ సుందరబాబు దైవ సందేశాన్ని అందించారు. కోటప్పకొండ రోడ్డులోని చర్చి ఆఫ్ క్రైస్ట్‌లో, హర్ష కళాశాలల ప్రాంగణంలోని చర్చి, అంధుల పాఠశాల ప్రాంగణంలోని చర్చి, పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని చర్చిలు, ప్రార్థనా మందిరాలలో కూడా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. క్రైస్తవ భక్తి గీతాలను ఆలపించారు. రావిపాడులోని అమలోద్భవి మాత చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

● చిలకలూరిపేట: పట్టణంలోని శాంతి నిలయంలో క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ ప్రేమ, దయ, కరుణ, శాంతిలపై ఏసుక్రీస్తు చూపిన బాట అనుసరణీయమన్నారు. పాస్టర్ నందమూరి క్రిస్టఫర్ ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టడాన్ని అభినందించారు. పాస్టర్ క్రిస్టఫర్ మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారికి సీఎంఆర్ఎఫ్ ఫండ్ నుంచి రూ.10లక్షలు అందించిన మానవతావాది పుల్లారావు అని కొనియాడారు. వేడుకలలో భాగంగా పుల్లారావు కేక్ కట్‌చేసి, పాస్టర్లకు, టీడీపీ, జనసేన నాయకులకు తినిపించి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియచేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ తోట రాజారమేశ్, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరీముల్లా, కామినేని సాయిబాబు, కరిముల్లా, పిల్లి కోటి, పంగులూరి వెంగళరాయుడు, జనసేన నాయకులు షేక్ మునీర్, సుభాని, షేక్ బాషా పాల్గొన్నారు.



శావల్యాపురం: పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న యోహేజ్కేలు, కస్తూరి

● యడ్లపాడు: యేసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్‌ను క్రైస్తవులు బుధవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని అన్ని చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి ఉదయం ఐదు గంటల వరకు ప్రధాన వీధులలో పాటలు పాడుతూ తిరిగారు. అనంతరం ఉదయారాధన నిర్వహించి క్రిస్మస్ కేక్‌ను కట్‌చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆర్‌సీఎం చర్చిలలో అర్ధరాత్రి 12గంటల నుంచి తెల్లవారుజామున 5గంటల వరకు, లూథరన్ చర్చిలలో మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రార్థన కార్యక్రమాలను నిర్వహించారు. తిమ్మాపురం లూథరన్ క్రీస్తు కృపాలయంలో పాస్టర్ డేవిడ్ వాక్యోపదేశం చేయగా, యడ్లపాడు పైపల్లె కొండపై ఉన్న లూథరన్ క్రీస్తుదేవాలయంలో జరిగిన ప్రార్థనలలో పాస్టర్ కనపర్తి ఏసురత్నం క్రీస్తు సందేశాన్ని చదివి వినిపించారు. కొండవీడు, కారుచోల, సొలస, మైదవోలు గ్రామాల్లోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

● రొంపిచర్ల: మండలంలోని గ్రామాల్లో క్రిస్మస్ పర్వదినాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. రొంపిచర్ల, అన్నవరం, మునమాక, అలవాల, కొత్తపల్లి తదితర గ్రామాల్లో చర్చిలను అందంగా తీర్చిదిద్దారు. క్రిస్మస్ ట్రీలను ఏర్పాటుచేశారు. బుధవారం అర్ధరాత్రి నుంచి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. గ్రామాల్లో ప్రదర్శనలను నిర్వహించారు.

● శావల్యాపురం: క్రిస్మస్ పండుగ సందర్భంగా మండలంలోని కారుమంచి, మతుకుమల్లి, బొందిలిపాలెం, శానంపూడి, శావల్యాపురం, పోట్లూరు, వేల్పూరు తదితర గ్రామాల్లో క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి భక్తిగీతాలు ఆలపించారు. శావల్యాపురం, బొందిలిపాలెం గ్రామాలలోని విమోచనా ప్రార్థన మందిరాల్లో పాస్టర్ యోహేజ్కేలు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను వైభవంగా నిర్వహించారు. భక్తులు, చిన్నారులతో కలసి పాస్టర్లు చర్చిల్లో క్రిస్మస్ కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, డ్యాన్స్‌లు, నృత్య ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకొన్నారు. అనంతరం పాస్టర్ యోహేజ్కేలు, చర్చి సెక్రటరీ కస్తూరి పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు రాక్ ప్రశాంత్, జానబీ, నిశాంత్, ప్రశాంతి, న్యాయవాది గంధం వెంకటేశ్వర్లు, చర్చి కమిటీ సభ్యులు సోమేపల్లి వెంకటేశ్వర్లు, పద్మనాభుని కోటేశ్వరరావు, ఒత్తుల బాబు, యడవల్లి వెంకట్రావు, చెరుకూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేద పిల్లలకు దుస్తులు పంపిణీ

● వినుకొండ టౌన్: క్రిస్మస్ పండుగ సందర్భంగా అబిల్ కలాం థెరిస్సా సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఫౌండేషన్ వ్యవస్థపక అధ్యక్షుడు చందోలు నాగవాణి వెన్నపూసకాలనీలో 100మంది పేద విద్యార్థులకు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చందోలు నాగవాణి మాట్లాడుతూ క్రీస్తు బోధించిన మార్గంలో ప్రజలు నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్ నల్లబోతుల ఏసురత్నం. సిస్టర్ రీతా విజన్, సిస్టర్ మాణిక్యమ్మ, పూనీటి సంతోషి, పెద్దేటి రాంజేంద్ర ప్రసాద్, సిస్టర్ పల్లవి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గణపవరంలో దుస్తులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

● వినుకొండ: పట్టణంలోని వెల్లటూరు రోడ్డులోని నారాయణ స్కూల్ ఆవరణలో క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ హర్షవర్ధన్‌రెడ్డి, ఏజీఎం లక్ష్మణ్ రెడ్డి కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీస్తు మార్గం అనుసరణీయమని, శాంతి సమాధానాలతో జీవిస్తూ పొరుగువారిని ప్రేమించడమే నిజమైన క్రిస్మస్ అని తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులు ధరించిన వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కో ఆర్డినేటర్ భద్రారెడ్డి, గౌసియా రిహానా, మాధవి, అనురాధ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● వినుకొండ టౌన్: పట్టణంలోని తెలుగు బాప్టిస్టు చర్చిలో క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా మంగళవారం రాత్రి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక వాచ్‌నైట్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం క్రిస్మస్ సందర్భంగా పాస్టర్ రెవరెండ్ డాక్టరు స్వర్ణకుమార్ క్రిస్మస్ ఆదరణ దైవ సందేశం అందజేశారు. సంఘం అధ్యక్షుడు చాట్ల రామయ్య, సెక్రటరి గద్దల ఆశీర్వప్రసాద్, ట్రెజరర్ సునీల్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ మోజెస్, నాగస్వామి, కూచిపూడి వినోద్‌కుమార్, బేతం మోజెస్, గద్దల ప్రేమ్ నాద్‌ప్రకాశ్, కాల్వ సుందరరావు, మహిళ కె.ఆశాలత, జీవన్, గద్దల గ్రేస్, మనోహరం తదితరులు పాల్గొన్నారు.

● పెదకంచర్ల, ఏనుగుపాలెం, ఉప్పరపాలెం, తిమ్మాయపాలెం, చాట్రగడ్డపాడు, కొత్తపాలెం, శివాపురం, నడిగడ్డ, దొండపాడు, నీలగంగవరం, గోనుగుంట్లవారిపాలెం, విఠంరాజుపల్లి ఎస్సీ కాలనీ, బ్రాహ్మణపల్లి గ్రామాల్లోని చర్చిలలో క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారు.

● నాదెండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్‌ను క్రైస్తవులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆర్‌సీఎం, ఏఈఎల్‌సీ, బాప్టిస్ట్, హెబ్రోన్ తదితర సంఘాలకు చెందిన చర్చిల్లో క్రీస్తు జన్మదిన వృత్తాంతాన్ని వివరిస్తూ పాస్టర్లు సందేశాలు అందించారు. గణపవరంలోని చవిటిపాలెంలోని బైబుల్ ఫెయిత్ లూథరన్ చర్చిలో స్వచ్ఛంద సేవా సంస్థ జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ సొసైటీ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

● నూజెండ్ల: మండలంలోని నూజెండ్ల, పమిడిపాడు, కంభంపాడు, గుర్రపునాయుడుపాలెం, ఐనవోలు, చింతలచెరువు తదితర గ్రామాల్లో చర్చిల్లో ఉదయం నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

● బొల్లాపల్లి: మండలంలో క్రిస్మస్ సందర్భంగా చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రిస్మస్ కేక్‌లను కట్ చేశారు. పలు చర్చిల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

● ఈపూరు: మండలంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కొండ్రముట్ల, కొచ్చెర్ల, అంగలూరు, ఈపూరు, ముప్పాళ్ళ, ఊడిజర్ల, ఇనుమెళ్ళ బొమ్మరాజుపల్లి చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.



వినుకొండలో క్రిస్మస్ సందర్భంగా పేద పిల్లలకు దుస్తులు పంపిణీ చేస్తున్న చందోలు నాగవాణి, వినుకొండ నారాయణ పాఠశాలలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ప్రిన్సిపాల్ హర్షవర్ధన్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు

నేరాల నియంత్రణకు దాతల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటు

● నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు

శావల్యాపురం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట డివిజన్ పరిధిలో జరుగుతున్న అక్రమాలను, నేరాలను అడ్డుకునేందుకు స్వచ్ఛంద సేవాసంస్థలు, దాతల సహకారంతో ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు నర్సరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు తెలిపారు. వార్షిక తనిఖీలలో భాగంగా శావల్యాపురం పోలీస్‌స్టేషన్‌ను ఆయన బుధవారం సందర్శించారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులు, పెండింగ్ కేసు వంటి అంశాలను పరిశీలించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. డీఎస్పీ మాట్లాడుతూ ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. నర్సరావుపేట డివిజన్ పరిధిలో ఇప్పటికే 486 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది డివిజన్ పరిధిలో 67శాతం కేసులు రికవరీ చేశామన్నారు. గ్రామ సచివాలయాల్లోని మహిళా పోలీసులతో ప్రతి సోమవారం సమావేశాలు నిర్వహించి గ్రామ పరిస్థితులపై ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. శావల్యాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో బంగారు నగల అపహరణ కేసుల్లో 45శాతం రికవరీ చేశామని, మరో 25కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.



శావల్యాపురంలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు

శావల్యాపురంలో ట్రాఫిక్ సమస్యపై ఎస్ఐకి పలు సూచనలు చేశారు.

వర్టికల్ టీవీ ప్రారంభం

సైబర్‌నేరాలు, మాదకద్రవ్యాల వాడకాన్ని పూర్తిస్థాయిలో నివారించేందుకు పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు మీతో-మేము కార్యక్రమాన్ని రూపొందించారని నర్సరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో దాతలు సమర్పించిన వర్టికల్ టీవీని ఆవిష్కరించారు. రూ.37,500 విలువజేసే వర్టికల్ టీవీని విరాళంగా సమర్పించిన గ్రామానికి చెందిన మద్దినేని హరిబాబును డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. పల్నాడు జిల్లాలోని 34 పోలీస్‌స్టేషన్‌లలో రిసెప్షన్ కౌంటర్‌ల వద్ద వర్టికల్ టీవీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, వీటిలో నిందితుల వివరాలు, ఫొటోలు సైబర్ మోసాలపై వీడియోలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వినుకొండ రూరల్ సీఐ ప్రభాకర్‌రావు, ఎస్ఐ లోకేశ్వరరావు, కానిస్టేబుళ్ళు పాల్గొన్నారు.

ఈపూరులో...

ఈపూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని నర్సరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు అన్నారు. సాధారణ తనిఖీలలో బాగంగా బుధవారం సాయంత్రం ఈపూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు గురించి అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీతోపాటు వినుకొండ రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు ఉన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించండి

ఆదాయపు పన్ను శాఖ అదనపు కమిషనర్ సుప్రియరావు

చిలకలూరిపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆదాయపు పన్ను చెల్లించే వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాధ్యతగా మెలిగి, సకాలంలో పన్నులు చెల్లించాలని ఆదాయపు పన్ను శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ ఓఆర్ సుప్రియరావు బుధవారం కోరారు. పట్టణంలోని శ్రీనివాసం ఫంక్షన్ హాలులో ఆదాయపు పన్ను శాఖ ఆధ్వర్యంలో పన్ను చెల్లింపుదారుల కోసం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పన్ను చెల్లింపు దారులు సమస్యలు కొనితెచ్చుకోవద్దని, ప్రభుత్వ నిబంధనలను పాటించాలన్నారు. ఆదాయపు పన్ను చెల్లించే వారికి సందేహాలు ఉంటే నివృత్తి చేయటానికి తమ సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉంటారన్నారు. ఆదాయ పన్ను శాఖ అధికారి జి.అరుణ్ కుమార్ మాట్లాడుతూ డైరెక్ట్ టాక్స్ వివాద్ సే విశ్వాస్, మోసపూరిత రీఫండ్స్ అనే అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాలను పన్ను చెల్లింపుదారులు వినియోగించుకోవాలని కోరారు. ఖచ్చితమైన క్లెయిమ్స్‌ను అందజేయాలని సూచించారు. రిటర్న్స్ అందజేసేటప్పుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమానికి ఆడిటర్ జి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా టాక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తూబాటి మూర్తి, గబ్బిటి బాలసుబ్రమణ్యం, కటకం శివరాం ప్రసాద్, సుబ్బారావు గుప్తా, ట్యాక్స్ బార్ అసోసియేషన్ సభ్యులు, పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుప్రియరావు



చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులును అభినందిస్తున్న నోబుల్‌టీచర్స్ అసోసియేషన్ నాయకులు

బకాయిలను ఇప్పించాలి

జీవీకి ఉపాధ్యాయ సంఘ నాయకుల వినతి

వినుకొండ, డిసెంబరు 25: (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులకు డీఏతోపాటు నూతన పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటుచేసి మధ్యంతర భృతిని ప్రకటించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయ సంఘ నాయకులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు తీరని అన్యాయం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని, సమస్యలను సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్ళి త్వరగా పరిష్కారం అయ్యేలా కృషిచేయాలని కోరారు. నోబుల్ టీచర్స్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ పాఠశాలతోపాటు, ప్రాథమిక పాఠశాలల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బీవీ నాగేశ్వరరావు నేతృత్వంలో విస్తృతంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధ్యక్షుడు సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి మాతంగి సాంబశివరావు, బెల్లంకొండ మండల కమిటీ కార్యదర్శి కూరపాటి రాజాచౌదరి, సెల్వరాజు, గుంటూరు నగర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి సాయి విశ్వనాథ్, లలితబాబు, గుంటూరు నగర అదనపు కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వాజ్ పేయి విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

ఆదర్శనీయుడు, అజాత శత్రువు వాజ్‌పేయి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలకు సుపరిపాలన అందించిన అజాత శత్రువు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ఆదర్శనీయుడని, అటువంటి మహనీయుని విగ్రహం చిలకలూరిపేట పట్టణంలో ఏర్పాటు చేయడం గర్వకారణమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పట్టణంలోని నరసరావుపేట సెంటర్‌లో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వాజ్‌పేయి విగ్రహాన్ని ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ నైతిక విలువలకు కట్టుబడి, ప్రజాస్వామ్య పరిరక్షణకోసం దేశ ప్రధాని పదవిని కేవలం ఒక్క ఓటు తేడాతో తృణప్రాయంగా వదిలేసిన రాజకీయ శిఖరం వాజ్‌పేయి అని పేర్కొన్నారు. జాతీయ రహదారుల నిర్మాణంలో నూతన సంస్కరణలకు నాందిపలికి దేశ ఆర్థికాభివృద్ధికి బాటలు వేసిన దార్శనికుడన్నారు. టెలికం రంగంలో విప్లవాత్మక సంస్కరణలకు నాందిపలికారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి బిట్రా వెంకట శివనారాయణ, రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రొంగల గోపిశ్రీనివాస్, పల్నాడు జిల్లా ఇంచార్జ్ కొక్కెర శ్రీనివాస్ యాదవ్, కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు అలోకం సుధాకర్‌బాబు తదితరులు

ఘనంగా వాజ్‌పేయి శత జయంతి

వినుకొండ, డిసెంబరు 25: (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నాయకులు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతిని స్థానిక బీజేపీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పల్నాడు జిల్లా అధ్యక్షుడు అలోకం సుధాకర్ బాబు, పార్టీ సంస్థాగత ఎన్నికల జిల్లా అధికారి పీవీ కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అటల్‌బిహారీ వాజ్‌పేయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశం ఖ్యాతిని దశ, దిశల వ్యాపింపచేసిన గొప్ప నాయకుడు అన్నారు. భారతదేశానికి మూడుసార్లు ప్రధానమంత్రిగా తానుచేసిన సేవల గురించి కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోరంట్ల సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మేడం రమేష్, అధ్యక్షుడు ఆడిటర్ రాఘవులు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యాన్ని గోతాల్లోకి నింపుతున్న కూలీలు

అకాల వర్షంతో వరి రైతులకు ఇక్కట్లు

రొంపిచర్ల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో గత రెండు రోజుల నుంచి ఎడ తెరిపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. దీంతో వరి సాగుచేసిన రైతులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. కోసిన వరిని పరదాలపై ఉంచి హడావుడిగా నూర్పిడిచేశారు. ధాన్యాన్ని బస్తాల్లోకి నింపి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అధికశాతం కోతకు వచ్చిన వరి నేల కొరిగింది. దీంతో వాటిని సరిచేసే పనిలో నిమగ్నమయ్యారు. తడిచిన ధాన్యాన్ని కొనే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రేపు గుంటూరులో జాబ్‌మేళా

గుంటూరు (విద్య), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని మాస్టర్‌మైండ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ మట్టుపల్లి మోహన్ వెల్లడించారు. జాబ్‌మేళాలో ప్రిన్సిపాల్స్, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్, క్యాంపస్ ఇన్‌చార్జులు, క్లాస్ ఇన్‌చార్జులు, హాస్టల్ స్టాఫ్, అకౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, డీటీపీ ఆపరేటర్లు, కంప్యూటర్ హార్డ్‌వేర్, బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ సూపర్‌వైజర్లు, డ్రైవర్ల ఉద్యోగాలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 27న బ్రాడీపేట 3/9 క్యాంపస్‌లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్ విద్యార్హతలతో 21 నుంచి 45 సంవత్సరాలలోపు వారు అర్హులని తెలిపారు.